# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal


సంపుటి - 20 | సంచిక - 209 | హైదరాబాద్ | మంగళవారం 10-02-2026 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

బీసీసీఐ వార్షిక కాంట్రాక్టులు.. విరాట్, రోహిత్‌లకు షాక్

## తెలంగాణలో ముగిసిన ఎన్నికల ప్రచారం..
# ఎల్లుండి పోలింగ్



11లో

- రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు 11వ తేదీన పోలింగ్
- ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 వరకు పోలింగ్
- ఈ నెల 13న ఓట్ల లెక్కింపు

## మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన
# స్టాండింగ్ కమిటీ చివరి సమావేశం


11లో


11లో

## తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారం, కవిత అంశాలపై
# రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

- తిరుమల లడ్డూ వ్యవహారం ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిందన్న ముఖ్యమంత్రి
- తెలంగాణలో అన్ని దేవాలయాల్లో విజయ డెయిరీ నెయ్యినే ఉపయోగిస్తున్నట్లు స్పష్టీకరణ
- కవిత జైలుకు వెళ్తే కేటీఆర్, హరీశ్ రావు సీఎం కావాలని చూస్తున్నారని వ్యాఖ్య
- పంపకాల్లో తేడా రావడంతో కొట్టుకుంటున్నారన్న ముఖ్యమంత్రి


11లో

## మేడారం హుండీల లెక్కింపు...
# ఐదు రోజుల్లో రూ.11.83 కోట్ల ఆదాయం

## 'పరీక్షా పే చర్చ'లో దేశ నిర్మాణంపై
# విద్యార్థులకు మోదీ పాఠాలు


11లో

- వికసిత భారత్ గురించి విద్యార్థులు ఆలోచించడంపై ప్రధాని మోదీ హర్షం
- అన్నం వృథా చేయకపోవడం దేశ నిర్మాణంలో భాగమేనని సూచన
- విజయానికి క్రమశిక్షణే పునాది అని విద్యార్థులకు ప్రధాని స్పష్టీకరణ
- 'పరీక్షా పే చర్చ'లో విద్యార్థులతో ముచ్చటించిన ప్రధాని మోదీ



11లో

## పీఎఫ్ డబ్బులు
# ఇక యూపీఐతోనే..
ఏప్రిల్ నుంచి కొత్త సేవలు!



11లో

## క్షేత్రస్థాయిలో పర్యటించండి..
# విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

- వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశం
- హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై కీలక వ్యాఖ్యలు... అధికారులదే బాధ్యత అని హెచ్చరిక
- క్షేత్రస్థాయిలో పర్యటించి పాలన అమలును పరిశీలించాలని మంత్రులకు సూచన
- గత ప్రభుత్వ అప్పుల వల్ల అధిక వడ్డీలు చెల్లిస్తున్నామని వెల్లడి
- త్వరలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకురానున్నట్లు ప్రకటన

## అన్నమయ్య జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం..
# 24 వేల కోళ్ల మృతి

- సదుం మండలంలోని మూడు గ్రామాల్లో 24 వేల కోళ్ల మృతి
- భోపాల్ ల్యాబ్ పరీక్షల్లో వైరస్‌గా నిర్ధారించిన అధికారులు
- ప్రభావిత గ్రామాల్లో అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- ఆందోళన వద్దు, జాగ్రత్తలు పాటించాలన్న నిపుణులు



11లో

# ఇక గల్ఫ్ దేశాలే

ప్రపంచ వాణిజ్య యుద్ధాలు, ట్రంప్ టారిఫ్ వార్‌తో ప్రపంచ వ్యాప్తంగా సప్లయ్ చైన్ దెబ్బతింటోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కారణంగా చాలా దేశాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. భారత్‌పై ట్రంప్ 2.0 విధించిన టారిఫ్‌లతో ఫార్మా, టెక్స్‌టైల్, జెమ్స్ తదితర రంగాలు ఒడిదుడుకులకు లోనయ్యాయి. చాలా మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చింది. ఈ తరుణంలో మోదీ తన చాణక్యంతో వ్యాపార విస్తరణపై దృష్టి పెట్టారు. అమెరికాను మించిన ఒప్పందాలు చేసుకుంటూ టారిఫ్‌ల ప్రభావం భారత్‌పై పడకుండా చేశారు. ఆస్ట్రేలియా, యూకే, యూఏఈ, యురోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నారు. దీంతో షాక్ అయిన ట్రంప్ ఇప్పుడు దిగి వచ్చారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి సై అంటున్నారు. అదీ మనం చెప్పినట్లుగా, మన కండీషన్స్ అంగీకరిస్తూనే.ప్రపంచ వాణిజ్య యుద్ధాల మధ్య భారత్, యూరోపియన్ యూనియన్, అమెరికాతో ఒప్పందాల తర్వాత గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)లోని ఆరు దేశాలతో ఫ్రీ ట్రేడ్ ఒప్పంద చర్చలు ప్రారంభించింది. యూఏఈ, ఒమాన్‌తో ఇప్పటికే అమలులో ఉన్న ఒప్పందాలు ఆధారంగా, సౌదీ అరేబియా, ఖతర్, కువైత్, బహ్రెయిన్‌తో సంబంధాలు బలోపేతమవుతాయి. ఈ చొరవ భారత విదేశీ వ్యాపార వ్యూహానికి కొత్త ఊపిరి పోస్తుందిఒప్పందం విజయవంతమైతే, ఆహార ఉత్పత్తులు, ఫార్మా, టెక్నాలజీ ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయి. గల్ఫ్ దేశాల నుంచి ఇన్వెస్ట్‌మెంట్‌లు మాన్యుఫాక్చరింగ్, ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల్లో ప్రవేశిస్తాయి. ఇది ఉద్యోగాలు, జీడీపీ వృద్ధికి దోహదపడుతుంది. ఇప్పటికే యూఏఈతో విస్తరణ జరిగిన మోడల్, మిగతా దేశాలకు మార్గదర్శకంగా పనిచేస్తుంది. రు నెలలుగా ట్రంప్ భారత్‌ను ఇబ్బంది పెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మోదీపై, భారత్‌పై విమర్శలు చేస్తున్నారు. అయితే మన సహనం మోదీకి చికాకు తెప్పించింది. చివరకు మోదీ వద్దకు ట్రంపే దిగివచ్చేలా చేసింది. ట్రంప్ టారిఫ్ వార్ నుంచి వెనక్కి తగ్గారు. 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గించారు. ఇక నెలలుగా జరుగుతున్న వాణిజ్య ఒప్పందం చర్చలు కొలిక్కి వచ్చాయి. మొదటి దశ వాణిజ్య ఒప్పందం ఆమోదం పొందింది. ఈమేరకు రెండు దేశాలూ ఐక్యంగా ప్రకటన విడుదల చేశాయి. పరస్పర ప్రయోజనాలు కలిగించే పూర్తి ఒప్పందానికి పునాది వేశాయి.తాజాగా కుదిరిన మధ్యంతర ఒప్పందంపై కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ స్పందించారు. ఈ ఒప్పందాన్ని భారత వాణిజ్య చరిత్రలో మైలురాయిగా ప్రకటించారు. ఇది దేశ ఎగుమతులకు 30 ట్రిలియన్ డాలర్ల అవకాశాలు తెరుస్తుందని చెప్పారు. ముఖ్యంగా చిన్న తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), రైతులు, చేపలు పట్టేవారికి గణనీయ ప్రయోజనాలు చేకూరుతాయి. ఎగుమతుల పెరుగుదలతో దేశవ్యాప్తంగా మహిళలు, యువతకు అనేక ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది.భారత్?అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో దుస్తులు, చర్మ సామగ్రి, జుట్టు ఉత్పత్తులు, ప్లాస్టిక్, రబ్బర్ వస్తువులు, కొన్ని రసాయనాలు, ఇంటి అలంకార వస్తువులు, చేతి పని నైపుణ్య ఉత్పత్తులు, ఎంపికైన యంత్రసామగ్రి ధరలు తగ్గుతాయి. అమెరికన్ పరిశ్రమ వస్తువులు, కొన్ని పండ్లు, సోయాబీన్ ఆయిల్, వైన్ వంటి వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ టారిఫ్‌లను తొలగించనుంది లేదా తగ్గిస్తుంది. మరోవైపు, భారత జనరిక్ మందులు, రత్నాలు, వజ్రాలు, విమాన భాగాలపై అమెరికా సుంకాలు ఎత్తేసే అవకాశం ఉంది.భారత్, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపుతుందని అమెరికా పేర్కొంది. బదులుగా అమెరికా నుంచి పెద్ద మొత్తంలో ఇంధనం, గ్యాస్ దిగుమతి చేస్తామని భారత్ అంగీకరించింది. 500 బిలియన్ డాలర్ల విలువైన అమెరికన్ దిగుమతులకు మార్గం సుగమం అవుతుంది. ఇక భారత్?ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పాకిస్తాన్‌కు తీవ్ర నష్టం కలిగిస్తోంది. అమెరికా టారిఫ్‌ల నుంచి తప్పించుకుని భారత టెక్స్‌టైల్స్, జెమ్స్ పరిశ్రమలు యూరప్ మార్కెట్‌లో ప్రవేశపెట్టుకుంటున్నాయి. పాక్ నుంచి యూరప్‌కు సంవత్సరానికి 9 బిలియన్ డాలర్ల ఎగుమతుల్లో టెక్స్‌టైల్స్, అపారెల్‌లు ప్రధానం. పన్ను రహిత భారత ఎగుమతులు పోటీని పెంచుతాయి.పాక్ ఎగుమతుల్లో 66% పన్ను రహితం, సంవత్సరానికి 7 బిలియన్ డాలర్ల టెక్స్‌టైల్స్ ఎగుమతులే. భారత్?ఈయూ ఒప్పందంతో ఇవి సగానికి పడిపోవచ్చు. కోటి మంది ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉంది. పాకిస్తాన్ కామర్స్ మంత్రి, టెక్స్‌టైల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భారత డీల్ పాకిస్తాన్‌కు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు.అమెరికా మార్కెట్ నష్టాన్ని భారతం యూరప్‌తో భర్తీ చేసుకుంది, ఇక పాకిస్తాన్ యూరప్ ఎగుమతుల కోసం భారత ఎగుమతులతో పోటీ పడాల్సిన పరిస్థితి. ట్రంప్ సంబంధాలు ఆర్థిక లాభాలు ఇవ్వకపోగా, భారత వాణిజ్య వ్యూహం పాక్ వస్త్ర పరిశ్రమను చావుదెబ్బ కొట్టింది.గల్ఫ్ దేశాలు ప్రపంచ ఇంధన వనరుల 40% నియంత్రిస్తున్నాయి. ఈ ఒప్పందం భారత ఇంధన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. వాణిజ్య రక్షణను పెంచుతుంది. గల్ఫ్ దేశాలు ఆయిల్ ఆధారిత ఆర్థిక వ్యవస్థల నుంచి డైవర్సిఫై అవుతున్న సమయంలో, భారత మార్కెట్ వారికి ఆకర్షణీయంగా మారుతోంది. ఇది ద్వైపాక్షిక వ్యాపారాన్ని రెట్టింపు చేసే అవకాశం ఉంది.టారిఫ్ ఆంక్షలు, నిబంధనల సమన్వయం సవాళ్లుగా ఉన్నాయి. అయితే, వ్యూహాత్మక బలం, మ్యూచువల్ లాభాలు చర్చలను వేగవంతం చేస్తాయి. విజయం సాధిస్తే, భారత వాణిజ్యం మెరుగుపడుతుంది. గ్లోబల్ అనిశ్చితుల మధ్య భారత ఆర్థిక స్థిరత్వాన్ని బలపరుస్తుంది.

# మళ్లీ ఎలక్షన్ ఫీవర్.. స్థానిక సంస్థలకు ఎన్నికలు.

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 09:

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కసరత్తు ప్రారంభమైంది. ఓటర్ల జాబితా తయారీ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. జనవరి ఒకటో తేదీ ప్రామాణికంగా ఓటర్ల జాబితా నవీకరించాలని.. మార్చి 9వ తేదీ నాటికి ఓటర్ల తుది జాబితా ప్రకటించాలని కలెక్టర్లను ఎన్నికల సంఘం ఆదేశించింది. మరోవైపు ఏపీలో మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పదవీకాలం మార్చి 17తో ముగియనుంది. అలాగే గ్రామ పంచాయతీలో పదవీకాలం ఏప్రిల్ 2వ తేదీతో ముగియనుంది.ఏపీలో మళ్లీ ఎన్నికల హడావిడి మొదలు కానుంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కసరత్తు మొదలైంది. ఒకటి రెండు నెలల్లో ఏపీలోని పంచాయతీలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా కొత్త ఓటర్ల జాబితా రూపకల్పన కోసం ఏపీ రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం నోటిఫికేషన్లు జారీ చేసింది. ఓటర్ల జాబితా తయారీని వెంటనే ప్రారంభించాలని.. మార్చి నెల 9వ తేదీన ఫోటోలతో సహా ఓటర్ల తుది జాబితాను ప్రచురించాలని జిల్లా కలెక్టర్లకు ఎస్ఈసీ నీలం సాహ్ని ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు సీఈవో కార్యాలయం నుంచి అసెంబ్లీల వారీగా ఓటర్ల జాబితాలు సేకరించిన రాష్ట్ర ఎన్నికల సంఘం.. ఆ వివరాలను సర్వర్లలో రికార్డు చేసింది.మరోవైపు మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులకు లాగిన్లు ఇచ్చారు. ఈ లాగిన్ల ద్వారా జాబితాలు సేకరించుకుని.. వాటిలో నుంచి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగానే ఓటర్ల జాబితా తయారు చేయనున్నట్లు తెలిపింది. 2026 జనవరి ఒకటో తేదీని ప్రామాణికంగా తీసుకుని ఓటర్ల జాబితా అప్ డేట్ చేయాలని సూచించింది.ఏపీలో 123 పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయి. 87 నగర పంచాయతీలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పదవీకాలం మార్చి 17తో ముగుస్తుంది. ఇక 36 పట్టణ స్థానిక సంస్థలలో కోర్టు కేసులు, ఇతర కారణాలతో ఎన్నికలు జరగలేదు. ఈ నేపథ్యంలోనే ఈ రెండూ కలిపి 123 పట్టణ స్థానిక సంస్థలలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.వీటిలోని వార్డులు, డివిజన్ల వారీగా ఓటర్ల జాబితా తయారు కానుంది. అలాగే ఏపీలోని 13,098 పంచాయతీల పదవీ కాలం ఏప్రిల్ రెండో తేదీతో ముగియనుంది. 253 పంచాయతీల్లో వివిధ కారణాలతో ఎన్నికలు నిర్వహించలేదు. తాజాగా మొత్తంగా 13,351 పంచాయతీలలోనూ ఎన్నికల నిర్వహణ కోసం ఓటర్ల జాబితా సిద్ధం చేయనున్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి

# సాఫ్ట్ గా మాధవ్.. ఇక పెరిగేది ఎలా

విశాఖపట్టణం, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 09:

దక్షిణాదిలో ఏపీలో మాత్రమే బీజేపీకి చెప్పుకోదగ్గ స్రెంథ్ లేదు. ఒంటరిగా పోటీ చేస్తే ఒక్క సీటు కూడా వచ్చే సీన్ లేదు. అందుకే కూటమిలో భాగంగా ఉంటూనే..నవ్యాంధ్రలో కమల వికాసం కోసం ఎత్తులు వేస్తున్నారు జాతీయ పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను నిర్వహించడం తప్ప.. గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణం కోసం, క్యాడర్ బలోపేతం కోసం అధ్యక్షుడిగా మాధవ్ కొత్తగా చేస్తున్నదేమి లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అధ్యక్షుడు చేపడుతున్న కొద్దిపాటి యాక్టివిటీకి కూడా పార్టీ నేతలు, ప్రజాప్రతినిధుల నుంచి కోఆపరేషన్ లేదని క్యాడర్ ఆవేదన వ్యక్తం చేస్తోంది. 2019లో ఒంటరిగా పోటీ చేసి ఓట్లు తెచ్చుకోవడం తప్ప..ఒక్క సీటు కూడా గెల్వలేకపోయింది బీజేపీ. 2024కు వచ్చే సరికి కూటమిగా జత కట్టి..అసెంబ్లీతో పాటు పార్లమెంట్ ఉభయ సభల్లో ఏపీ నుంచి ప్రాతినిధ్యం దక్కించుకుంది.కమలనాథులు.ఇప్పటికంటే ఇంకింత బలంగా..మరింత స్ట్రాంగ్‌గా నిలబడేందుకు సరికొత్త స్ట్రాటజీస్ ప్లే చేస్తున్నారు. అందుకే ఓ చేతిలో బీజేపీ జెండా..ఇంకో చేతిలో కూటమి అజెండాతో..కలిసి నడుద్దాం. పార్టీ కోసం కష్టపడుదామంటూ ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ పిలుస్తున్నారు. కానీ సీనియర్ లీడర్లలో మాత్రం ఆ దూకుడు కనిపించట్లేదట.అదే కూటమిలో భాగస్వామిగా ఉన్న టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు దూసుకెళ్తున్న స్పీడుగా..కమలనాథులు ప్రజల్లోకి వెళ్లలేకపోతున్నారట. దీంతో ఏపీలో బీజేపీ మినహా మిగతా రాజకీయ పార్టీలన్నీ యాక్టివ్‌గానే ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. అధికార కూటమి కీలకంగా ఉన్న టీడీపీ..మళ్లీ పవర్‌లోకి రావాలని ఎత్తులు వేస్తున్న వైసీపీ..ఎక్కడా తగ్గట్లేదు. రేపే ఎలక్షన్స్ ఉన్నాయన్నట్లుగా ఆ రెండు పార్టీలు ఎప్పుడూ సూపర్ యాక్టీవ్‌గా ఉంటున్నాయి.జనసేన కూడా అటు పార్టీ నిర్మాణంలోనూ ఇటు పొలిటికల్‌గాను దూకుడు మీదుంది. చివరికి కాంగ్రెస్ పార్టీ కూడా ఏదొక హడావుడి చేస్తూనే ఉంటుంది. పార్టీకి క్యాడర్, లీడర్లు లేకపోయినా షర్మిల చేసే పొలిటికల్ కామెంట్స్ నిత్యం ప్రజల్లో చర్చనీయాంశం అవుతున్నాయి. కానీ ఏపీలో బీజేపీ మాత్రం అంత యాక్టీవ్‌గా కనిపించట్లేదన్న చర్చ ఉంది.ఏపీలో కూటమిలో భాగస్వామిగా ఉన్నా అటు ప్రభుత్వంలోనూ ఇటు పొలిటికల్ గాను పార్టీ యాక్టివిటీ చాలా తక్కువ. ఇక పార్టీ బలోపేతం కోసం, పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బలమైన ప్రయత్నాలేమి జరగడం లేదని కార్యకర్తలే చర్చించుకుంటున్న పరిస్థితి. దీనికి కారణం బీజేపీ కీలక నేతలు సైలెంట్ మోడ్‌లో ఉండటవే అంటున్నారు.కేంద్రంలో అధికారంలో ఉంటూ..చాలా రాష్ట్రాల్లో పవర్‌లో కొనసాగుతూ..ఏపీ ప్రభుత్వంలో కీరోల్ ప్లే చేస్తున్నప్పటికీ..ఏపీలో మాత్రం ఆశించినంతగా కమలం లీడర్లు దూకుడు ప్రదర్శించడం లేదంటున్నారు. పక్కనే ఉన్న తెలంగాణలో బీజేపీ లీడర్లు అధికారంలోకి వచ్చేది తామేనని చెప్పుకుంటూ..అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్‌ను ఢీకొడుతూ ముందుకెళ్తుంటే..ఏపీ బీజేపీ లీడర్లు పార్టీని గాలికి వదిలేశారని క్యాడర్ బాణాలు ఎక్కుపెడుతోంది.ఏపీలో బీజేపీకి 12 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు, ఇద్దరు రాజ్యసభ సభ్యులు, ఒక ఎమ్మెల్సీతో పాటు రాష్ట్ర ప్రభుత్వంలో ఒక మంత్రి ఉన్నారు. ఏపీ నుంచి గెలిచిన ముగ్గురు బీజేపీ ఎంపీల్లో భూపతిరాజు శ్రీనివాసవర్మ కేంద్రమంత్రిగా ఉన్నారు. వీరికి తోడు పార్టీలో సీనియర్ నేతలు ఉన్నారు. వీరెవరూ పార్టీ బలోపేతం కోసం ప్రత్యేక చొరవ చూపట్లేదని కార్యకర్తలే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కేంద్రం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేలా ఎలాంటి యాక్టీవిటీ చేపట్టకపోవడంతో పాటు..పొలిటికల్ ఇష్యూస్‌పై కూడా ఒక్కరూ నోరెత్తకపోవడం చర్చనీయాంశంగా మారింది. లీడర్లే సైలెంట్ మోడ్‌లో ఉండటంతో ఏపీ బీజేపీపై ప్రజల్లో చర్చకే ఆస్కారం లేకుండా పోయిందంటున్నారు. అధ్యక్షుడిగా మాధవ్ ఉన్నప్పటికీ ఆయన వాయిస్ పెద్దగా ప్రజలోకి వెళ్లడం లేదనేది రాజకీయ వర్గాల్లో చర్చ.ఇలాంటి పరిస్థితుల్లో మెల్లగా పార్టీని బలోపేతం చేసుకుంటూ పోతే చట్టసభల్లో తమ ప్రాతినిధ్యాన్ని ఇంకా పెంచుకునే అవకాశం ఉంటుంది. కానీ ఆ దిశగా ఏపీ బీజేపీ నేతలు చేస్తున్న ప్రయత్నాలేమి లేవంటున్నారు కార్యకర్తలు. త్వరలోనే స్థానిక, మున్సిపోల్స్ ఎన్నికలు రాబోతున్నాయి. స్థానిక, పురపోరు కోసం పార్టీని సన్నద్ధం చేసేందుకు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ద్వితీయ శ్రేణి నేతలు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారుఅధికారంతో సంబంధం లేకుండా పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ కార్యకర్తలు..నేతలు..ఏపీ బీజేపీ నేతల తీరుపై తీవ్ర అసహనంతో ఉన్న పరిస్థితి. కూటమిలో టీడీపీ, జనసేన తమ పార్టీలను మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తుంటే బీజేపీ లీడర్లు మాత్రం పార్టీని పట్టించుకోవడమే మానేశారన్న విమర్శలు కమలం పార్టీలో కాక పుట్టిస్తున్నాయి.

# టీడీపీలో ఫైర్ బ్రాండ్ మహిళా లీడర్లు

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 09:

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ విజయ పరంపరకు మహిళా నేతలు నేడు అసలైన పిల్లర్లుగా నిలుస్తున్నారు. ముఖ్యంగా రెడ్డప్పగారి మాధవీరెడ్డి, మంత్రి సవిత, హోంమంత్రి వంగలపూడి అనిత, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, మంత్రి సంధ్యారాణి వంటి నేతలు నేడు అసెంబ్లీలోనూ, బయటా తమ గళాన్ని వినిపిస్తూ ప్రత్యర్థులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. వీరిలో కొందరు రాజకీయ వారసత్వంతో వచ్చినా, మరికొందరు సామాన్యులుగా రాజకీయాల్లోకి వచ్చినా.. తమదైన శైలిలో అరాచక శక్తులపై పోరాడుతూ పార్టీలో తిరుగులేని స్థానాన్ని సంపాదించుకున్నారు.రాయలసీమ గడ్డపై భూమా అఖిలప్రియ, గౌరు చరిత రెడ్డి వంటి వారు చూపుతున్న తెగువ రాజకీయాన్ని మరో స్థాయికి తీసుకువెళ్లింది. అరాచక పార్టీగా ముద్రపడిన వైసీపీ నాయకుల బెదిరింపులకు వెరవకుండా, క్షేత్రస్థాయిలో ప్రజలకు అండగా నిలవడంలో వీరు ముందుంటున్నారు. అలాగే గౌతు శిరీష, యువ నేత బండారు శ్రావణి శ్రీ వంటి వారు తమ వాగ్ధాటితో, కార్యదక్షతతో మెరుస్తున్నారు. వీరంతా కేవలం పదవుల కోసం కాకుండా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతున్న తీరు టీడీపీని మహిళా పక్షపాత పార్టీగా గట్టిగా నిలబెట్టింది. గత ప్రభుత్వ హయాంలో వీరు ఎదుర్కొన్న వేధింపులు, పెట్టిన అక్రమ కేసులు వీరిని మరింతగా రాటుదేల్చాయే తప్ప ఎక్కడా వెనక్కి తగ్గించలేకపోయాయి.చంద్రబాబు నాయుడు దూరదృష్టితో టీడీపీలో మహిళలకు లభిస్తున్న ప్రాధాన్యత నేడు ఫలితాలను ఇస్తోంది. నారీ శక్తి ని కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా, నిర్ణయాధికారాల్లో భాగస్వాములను చేయడం వల్లే వీరు స్వతంత్రంగా , ధైర్యంగా తమ నిర్ణయాలను వెల్లడించగలుగుతున్నారు. ఈ ఫైర్ బ్రాండ్ మహిళా నేతలు చూపిస్తున్న చురుకుదనం సోషల్ మీడియాలో సైతం సెన్సేషన్ సృష్టిస్తోంది. తమ మీద దాడి జరిగినా, వ్యక్తిత్వ హననానికి పాల్పడినా.. రెట్టింపు వేగంతో కౌంటర్ ఇస్తూ ప్రత్యర్థి పార్టీలకు చుక్కలు చూపిస్తున్నారు.ఏపీ రాజకీయాల్లో ఈ మహిళా నేతలు ఒక కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. వీరంతా రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాలను శాసించే స్థాయికి ఎదుగుతారనడంలో ఎలాంటి సందేహం లేదు. టీడీపీ బలోపేతానికి వీరు చేస్తున్న కృషి, పార్టీకి ఇస్తున్న నైతిక బలం వెలకట్టలేనిది. ధైర్యానికి నిలువుటద్దంలా నిలుస్తూ, ప్రజాసేవలో దూసుకుపోతున్న ఈ మహిళా మణులు తెలుగు జాతి గర్వించదగ్గ నాయకురాళ్లుగా గుర్తింపు పొందుతున్నారు. అరాచకంపై వీరు సాగిస్తున్న ఈ ధర్మ యుద్ధం రాష్ట్ర ప్రగతికి , మహిళా సాధికారతకు ఒక గొప్ప నిదర్శనం.

# సామాజిక వర్గాన్ని నమ్ముకున్న వైసీపీ...

విశాఖపట్టణం, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 09:

ఏదైనా ఒక్కసారి చేస్తేనే వర్క్ అవుట్ అవుతుంది. పదే పదే అదే మాట అంటే ప్రజలు వినరు. తెలంగాణలో కెసిఆర్ ని తీసుకుందాం. రెండుసార్లు తెలంగాణ సెంటిమెంట్తో ఎన్నికలకు వెళ్లి గెలిచారు. కానీ మూడోసారి మాత్రం సెంటిమెంట్ తగ్గించి.. జాతీయ భావాలతో వెళ్లారు. అయినా సరే అక్కడి ప్రజలు గుర్తించలేదు. ఏపీలో కూడా అటువంటి సీన్ ఉంది. ఎందుకంటే జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఎన్నో రకాల ప్రయోగాలు చేశారు. అందులో కులప్రయోగం ఒకటి. 2014లో కాపులకు రిజర్వేషన్లు ఇస్తానని ప్రకటించారు చంద్రబాబు. ఆ ఒక్క అంశాన్ని పట్టుకొని ముద్రగడ పద్మనాభం పెద్ద ఉద్యమమే చేశారు. అది అంతిమంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూర్చింది. కానీ అదే ముద్రగడ పద్మనాభం వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమాన్ని వదిలేశారు. అదే ముద్రగడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరినా మొన్నటి ఎన్నికల్లో కాపులు ఇటువైపు చూడలేదు.కాపు రిజర్వేషన్ ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు ముద్రగడ పద్మనాభం. 2016 జనవరి 31న తుని కేంద్రంగా ముద్రగడ నేతృత్వంలో కాపు గర్జన సభ ఏర్పాటు చేశారు. చివరకు ఆ ఉద్యమం రైలు తగలబెట్టే వరకు వచ్చింది. ముద్రగడపై కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో జగన్మోహన్ రెడ్డి రాజకీయంగా తీసుకున్న కొన్ని రకాల నిర్ణయాలు కాపులను ఆకర్షించాయి. నాడు ముద్రగడపై తెలుగుదేశం ప్రభుత్వం పెట్టిన కేసులను కాపు కులం పై జరిగిన దాడిగా చిత్రీకరించడంలో జగన్మోహన్ రెడ్డి సక్సెస్ అయ్యారు. తద్వారా అప్పట్లో టిడిపి పొలిటికల్ గా భారీ డ్యామేజ్ కు గురైంది.అయితే తాజాగా అంబటి రాంబాబు అరెస్టు ఎపిసోడ్ ను కాపులపై జరుగుతున్న దాడిగా చిత్రీకరించేందుకు మరోసారి ప్రయత్నాలు మొదలుపెట్టారు. కాపులంటే చంద్రబాబుకు ఎందుకంత కక్ష? కాపు సామాజిక వర్గం నేతల మీద టిడిపి దాడులు ఏంటి? నాడు ముద్రగడపై అలా? నేడు అంబటి రాంబాబు పై ఇలా? అంటూ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ విశాఖ నుంచి సంఘీభావ యాత్ర మొదలు పెట్టేసారు. 300 కార్లతో యాత్రగా బయలుదేరారు. " నాడు ముద్రగడ మాదిరిగా అంబటి రాంబాబు ఎపిసోడ్ వర్కౌట్ కాదు. కూటమి పార్టీల తరఫున ఉన్న కాపు నేతలు మౌనం మరోసారి డ్యామేజ్ కు గురి చేసే అవకాశం ఉంది. ముద్రగడ రిజర్వేషన్ ఉద్యమాన్ని.. అంబటి రాంబాబు వ్యాఖ్యలను ఒకే గాటిలో కట్టలేం. కానీ ఎలాగైనా కాపులను మరోసారి తనవైపు తిప్పుకోవాలన్న జగన్మోహన్ రెడ్డి ఆలోచనలను కూటమి కాపు ఎమ్మెల్యేలు, మంత్రులు గుర్తించాల్సిన అవసరం ఉంది. తిప్పి కొట్టాల్సిన పరిస్థితి ఉంది. సామాజిక వర్గానికి చెందిన వంగవీటి రంగాను హత్య చేశారని, ముద్రగడ పద్మనాభాన్ని అనేక రకాలుగా వేధించారని, ఇపుడు అంబటి రాంబాబు మీద దాడి చేసి తిరిగి ఆయన మీద తప్పుడు కేసులు పెట్టారంటూ" కాపు నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్న

===================చీచీ

# స్థానిక ఎన్నికలు బహిష్కరణ ఆలోచనలు?

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 09:

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. మున్సిపల్, పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియగానే, వాటిని స్పెషల్ ఆఫీసర్ల పాలనలోకి వెళ్లనివ్వకుండా వెంటనే ఎన్నికలు జరిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృతనిశ్చయంతో ఉన్నారు. ముందుగా గ్రామ పంచాయతీలకు, ఆపై పరిషత్ ఎన్నికలకు, చివరగా మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేలా షెడ్యూల్‌ను సిద్ధం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఈ నిర్ణయం ప్రతిపక్ష వైసీపీని తీవ్ర ఆందోళనలోకి నెట్టింది.ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఈ ఎన్నికలు వైసీపీకి పెను సవాలుగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ క్యాడర్ ఇంకా కోలుకోలేదు. ఈ తరుణంలో ఎన్నికలకు వెళ్తే పరాభవం తప్పదనే భయం పార్టీ నేతల్లో కనిపిస్తోంది. ఇప్పటికే పార్టీలోని కొన్ని వర్గాలు ఈ ఎన్నికలను బహిష్కరించాలనే తీవ్ర ఆలోచన చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, ఒకసారి ఎన్నికలను బహిష్కరిస్తే గ్రామస్థాయిలో క్యాడర్ పూర్తిగా నిస్తేజమైపోతుందని, అది పార్టీ ఉనికికే ప్రమాదమని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.పోటీ చేస్తే ఓటమి భయం, తప్పుకుంటే క్యాడర్ దూరం.. ఈ విచిత్ర పరిస్థితి నుంచి బయటపడటానికి వైసీపీ న్యాయపోరాటాన్ని ఆశ్రయించే అవకాశం ఉందని భావిస్తున్నారు. వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ఖరారు లేదా ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కోర్టుల్లో పిటిషన్లు వేసి ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఎన్నికలను వాయిదా వేయడానికి చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టిన అనుభవం ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి ఎన్నికలను ఆలస్యం చేయడమే శ్రేయస్కరమని ఆ పార్టీ అగ్రనాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.మరోవైపు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు ఈ ఎన్నికల కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాయి. గ్రామాల్లో పట్టు పెంచుకోవడానికి ఇది సువర్ణావకాశమని భావిస్తున్న కూటమి నేతలు, క్షేత్రస్థాయిలో ప్రచారానికి సిద్ధమవుతున్నారు. వైసీపీ తన వ్యూహాలను మార్చుకోకపోతే, పంచాయతీ నుంచి మున్సిపాలిటీ వరకు ఏకపక్ష ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. మొత్తానికి ఏపీ స్థానిక ఎన్నికలు కేవలం పదవుల కోసం కాకుండా, రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం తన ఉనికిని కాపాడుకోవడానికి చేసే జీవన్మరణ పోరాటంగా మారనున్నాయి.

==========================

# డైరక్ట్ ఫైట్ కు కూటమి

తిరుపతి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 09:

ఏపీ పాలిటిక్స్‌లో కొద్దిరోజులుగా కల్తీ నెయ్యి వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తోంది. స్పెషల్ సిట్ సుప్రీంకోర్టుకు రిపోర్ట్ సబ్‌మిట్ చేయడంతో..ఆల్ ఆఫ్ సడెన్‌గా ఏపీ రాజకీయాల్లో అగ్గి రాజుకుంది. అప్పటికే రగులుతున్న ఏపీ పాలిటిక్స్‌లో సిట్ నివేదిక అగ్నికి ఆజ్యం పోసినట్లు అయింది. అప్పటినుంచి వివాదం సరికొత్త మలుపు తీసుకుంది. ఏకంగా కూటమిపై వైసీపీ ముప్పేట విమర్శల దాడికి దిగడమే కాదు..జంతువుల కొవ్వు అంటూ చేసిన వ్యాఖ్యలన్నీ తప్పేనని తేలిపోయిందని అటాక్ స్టార్ట్ చేసింది.చంద్రబాబు, పవన్ గతంలో చేసిన కామెంట్స్‌పై ఇప్పుడు దుమ్మెత్తిపోస్తూ వైసీపీ సోషల్ మీడియా, ఆ పార్టీ సానుభూతిపరులు, ఫ్యాన్ పార్టీ ముఖ్య నేతలకు తగ్గేదేలే అంటూ కూటమి టార్గెట్‌గా కామెంట్స్ చేస్తూనే ఉన్నారు. ఇంతలోనే మాజీమంత్రి అంబటి రాంబాబు నోరు జారడం..ఆయన ఇంటిపై దాడి, వెంటనే అంబటి అరెస్ట్ ఇలా అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయ్. ఈ పరిస్థితుల్లో ఎలా రియాక్ట్ కావాలో..కూటమి పెద్దలకు అర్థం కాని పరిస్థితి. కాస్త టైమ్ తీసుకుని అన్ని విషయాలను గమనించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ అటాక్ మోడ్‌లోకి దిగిపోయారు.ఇదే టైమ్‌లో అధికార కూటమి పార్టీల మధ్య సరికొత్త ఐక్యతకు రూట్ వేశారు. వైసీపీ విమర్శలు, సిట్ రిపోర్ట్, వైసీపీ నేతల ఇళ్లపై దాడి..ఇలాంటి అంశాల మధ్య కాస్త డిఫెన్స్ పడ్డట్లు కనిపించిన టీడీపీ, జనసేన, బీజేపీలు ఎదురుదాడికి దిగాయి. తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ వ్యవహారం భక్తుల సెంటిమెంట్‌కు సంబంధించిన అంశంగానే కాకుండా, రాజకీయ అస్తిత్వ పోరాటంగా మారింది. స్టార్టింగ్‌లో ఈ విషయంలో కొంత తడబడినట్లు కనిపించిన అధికార కూటమి..ఇప్పుడు ఫుల్ అలర్ట్ అయి వైసీపీ అలిగేషన్స్‌కు చెక్ పెట్టే ప్రయత్నం చేస్తోంది. ఏకంగా కూటమి పార్టీల ముఖ్యనేతల సమావేశం..చంద్రబాబు, పవన్, పీవీఎన్ మాధవ్ మీడియా బ్రీఫింగ్ చూసిన తర్వాత..కల్తీ నెయ్యి ఎపిసోడ్‌లో సీరియస్ యాక్షన్ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోందిసిట్ రిపోర్ట్, సుప్రీంకోర్టు వ్యాఖ్యలను అస్త్రాలుగా చేసుకుని వైసీపీ దూకుడు పెంచింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పాలంటూ వైసీపీ చేస్తున్న డిమాండ్లు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేయాలని కూటమి రివర్స్ స్ట్రాటజీ ప్లే చేస్తోంది. కేవలం ప్రభుత్వపరంగానే కాకుండా, రాజకీయంగా కూడా గట్టి సమాధానం ఇవ్వకపోతే తప్పుడు సంకేతాలు వెళ్తాయని..ఉమ్మడిగా మీడియా ముందుకు రావడం కీలక మలుపుగా మారింది. వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు మూడు పార్టీల ప్రతినిధులతో కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేయడం కూడా వ్యూహంలో భాగమే అంటున్నారు.గ్రౌండ్ లెవల్‌లో ప్రజలకు కల్తీ జరిగిన తీరును, గత ప్రభుత్వ హయాంలో జరిగిన టెండర్ల ప్రక్రియను వివరించాలని డిసైడ్ అయ్యారట. సిట్ చెప్పిందేంటి..వైసీపీ చేసుకుంటున్న ప్రచారమేంటన్న దానిపై కూడా ప్రజలకు నేరుగా ఎక్స్‌ప్లెయిన్ చేయడంతో పాటు, సోషల్ మీడియాలో విపక్షాలు చేస్తున్న నెగటివ్ ప్రచారాన్ని మూడు పార్టీల ఐటీ విభాగాలు సమన్వయంతో తిప్పికొట్టాలని నిర్ణయం తీసుకున్నారట.సిట్ రిపోర్ట్‌పై వైసీపీ హడావుడి చేస్తోందని, వాళ్ల ప్రచారాన్ని అదే స్థాయితో తిప్పికొట్టేందుకు వ్యూహరచన సిద్ధం చేశారట. ప్రభుత్వం వాయిస్‌గా కంటే కూటమి నేతల గళం బలంగా వినిపిస్తేనే వైసీపీని దూకుడును కంట్రోల్ చేయొచ్చని భావిస్తున్నారట. కల్తీ నెయ్యి ఎపిసోడ్‌లో అసలు నిందితులను వదలొద్దని..స్ట్రిక్ట్ యాక్షన్ తీసుకునేలా ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నారట. ఈ అంశంలో కూటమి పార్టీల మధ్య కోఆర్డినేషన్ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నుంచి త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేసి..సమన్వయంతో ముందుకెళ్లాలనే ఆలోచనకు వచ్చారట.మొదట మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్, కందుల దుర్గేశ్‌తో కమిటీ వేయాలని భావించారట. అయితే, ఈ నెల 11 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండటంతో మంత్రులు బిజీగా ఉంటారన్న ఉద్దేశంతో మూడు పార్టీల నుంచి ముగ్గురు కీలక నేతలతో కమిటీ ఏర్పాటు చేయాలని డిసైడ్ అయ్యారట. ఓవరాల్‌గా వైసీపీ దూకుడుకు బ్రేకులు వేసేలా..అటాక్ మోడ్‌లో వెళ్లాలనేది కూటమి పెద్దలు ఆలోచనగా చెబుతున్నారు. ఈ ఉమ్మడి పోరాటం కేవలం కల్తీ నెయ్యి అంశానికే పరిమితం కాకుండా, భవిష్యత్‌లో రాజకీయ అంశాలు, ఎన్నికల సమరం.. ఐక్య పోరాటానికి టర్నింగ్ పాయింట్‌గా మారే అవకాశం ఉంది.

ఇంకా లడ్డూ మంటలు

గత కొద్దిరోజుల నుండి సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా అని తేడా లేకుండా, ఎక్కడ చూసినా తిరుమల తిరుపతి లడ్డు మ్యాటర్ పై చర్చలు జరుగుతూనే ఉన్నాయి. 2019 వ సంవత్సరం నుండి 2024 వ సంవత్సరం మధ్యలో భక్తులకు ఇచ్చిన లడ్డూ ప్రసాదం లో కల్తీ జరిగిందని కోర్టుకు సిట్ 300 పేజీల నివేదిక ఇచ్చింది. ఇంత స్పష్టంగా కల్తీ జరిగింది అనే విషయాన్ని సిట్ నివేదిక లో ఇస్తే, ఎక్కడ తమ వైసీపీ పార్టీ కి నష్టం కలుగుతుందో అనే భయంతో ఆ పార్టీ నాయకులూ పెద్ద ఎత్తున మేము తప్పు చేయలేదు, కల్తీ జరగలేదు, సిట్ అదే నివేదిక ఇచ్చింది, సీఎం చంద్ర బాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇద్దరూ కూడా భక్తులకు అబద్దాలు చెప్పి మోసాలు చేశారు, వాళు ౖ క్షమాపణలు చెప్పాల్సిందే అంటూ జగన్ దగ్గర నుండి పార్టీ నాయకుల వరకు పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు.అయితే దీనిని కూటమి నాయకులు కూడా సమర్ధవతంగా ఉన్న వాస్తవాలను జనాలకు తెలుపుతూ కల్తీ లడ్డు వ్యవహారంలో వైసీపీ నాయకులను తిప్పి కొట్టారు. ఇప్పుడు ఈ సిట్ ఇచ్చిన నివేదిక ని నేషనల్ మీడియా కవర్ చేస్తోంది. దీని మీద డిబేట్స్ పెట్టి వైసీపీ పార్టీ ని ఒక రేంజ్ లో ఏకిపారేస్తున్నారు. కానీ వైసీపీ నాయకులు మాత్రం ఇంకా తమ వైపు తప్పు లేదనే వాదన తీసుకొస్తున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం లో టిటిడి చైర్మన్ గా పని చేసిన వై వీ సుబ్బారెడ్డి మాత్రం తిరుమల లడ్డూ తయారీ కోసం ఉపయోగించిన నెయ్యి లో కల్తీ జరిగింది అనే విషయం వాస్తవమే అని నేషనల్ మీడియా లో నోరు జారడం తో వైసీపీ పూర్తి స్థాయిలో డిఫెన్స్ మోడ్ లోకి వెళ్ళిపోయింది.అయితే పవన్ కళ్యాణ్ అభిమానులు గత వైసీపీ హయం లో లడ్డూ నాణ్యత గురించి భక్తులు సోషల్ మీడియా ద్వారా ట్వీట్స్ రూపం లో ఇచ్చిన ఫిర్యాదులను ఆధారాలతో సహా మళ్లీ బయటకు తీశారు. ఇది ఇప్పుడు సెన్సేషనల్ టాపిక్ గా మారిపోయింది. రసాయనాలు ఉపయోగించిన లడ్డూల ఆకారాలు ఎలా ఉన్నాయో ఈ క్రింది ట్వీట్ లో చూడండి. అవే లడ్డూలు కొన్ని రోజులకు పిండి పిండిగా మారిపోవడం వంటివి కూడా ఆ ఫోటోలో చూపించారు. ఇవన్నీ వై వీ సుబ్బా రెడ్డి దృష్టికి వెళ్లాయి. ల్యాబ్ లో టెస్టులు చేయగా, కల్తీ జరిగింది అంటూ రెండు రిపోర్ట్స్ కూడా వచ్చాయి. కానీ వైసీపీ ఏ మాత్రం పట్టించుకోలేదు. అవే లాదవాలను కొనసాగించింది. ఈ వాస్తవాలను చూసిన తర్వాత నెటిజెన్స్ వైసీపీ ని తీవ్ర స్థాయిలో తిట్టడం మొదలు పెట్టారు.

# కరీంనగర్ లో కాషాయ ప్రభంజనం

## బీజేపీని ఓడించేందుకు ఎంఐఎంతో కాంగ్రెస్ రూ.100 కోట్ల డీల్

### పెద్ద ఎత్తున ఓట్లను కొని గెలవాలని కుట్ర చేస్తున్నయ్ కరీంనగర్ లో 'విజయ సంకల్ప ర్యాలీ"లో కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

కరీంనగర్ భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 09:50 వేల మందితో కాషాయ కార్యకర్తలతో కదం తొక్కిన 'విజయ సంకల్ప ర్యాలీ"జన సంద్రమైన కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ లో కబడ్డీ ఆట మొదలైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఇండియా పేరుతో బీజేపీ, పాకిస్తాన్ పేరుతో కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు కలిసి కబడ్డీ ఆటను ప్రారంభించాయన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి 50 సీట్లు ఖాయమని తేలడంతో కబడ్డీ కప్ బీజేపీ గెలుచుకోవడం తథ్యమని తేలడంతో కాంగ్రెస్, ఎంఐఎం మధ్య రూ.100 కోట్ల డీల్ (మ్యాచ్ ఫిక్సింగ్) కుదిరిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ డబ్బుతో ఓట్లను కొనుగోలు చేసి బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. కరీంనగర్ లోని మీడియా, సోషల్ మీడియాసహా యువకులంతా కుల, మతాలకు అతీతంగా ఒక్కటై కాంగ్రెస్, ఎంఐఎం చేస్తున్న కుట్రలను వివరించి బీజేపీని బంపర్ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.ఈరోజు సాయంత్రం కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో కరీంనగర్ లో భారీ ఎత్తున "విజయ సంకల్ప ర్యాలీ" నిర్వహించారు. బీజేపీ తెలంగాణ ఇంఛార్జీ, మహారాష్ట్ర ఐటీ మంత్రి ఆశీష్ షెల్లార్, మాజీ ఎంపీ, సినీ నటి నవనతీ కౌర్ ముఖ్య ఈ ర్యాలీకి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

కరీంనగర్ కలెక్టరేట్ రెవిన్యూ గార్డెన్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీలో కనీవినీ ఎరగని రీతిలో వేలాది మంది కాషాయ పగిడీలు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో అత్యధికంగా మహిళలు పాల్గొనడం, ర్యాలీలో ఆద్యంతం వారు ఉత్సాహంగా నడుస్తూ జై బీజేపీ, జై మోదీ, జైజై బండి సంజయ్ అంటూ చేసిన నినాదాలతో కరీంనగర్ కాషాయ సంద్రమైంది. కరీంనగర్ రెవిన్యూ గార్డెన్ నుండి ప్రతిమ మల్టిప్లెక్స్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, వెంకటేశ్వర టెంపుల్, అమరవీరుల స్థూపం, పోస్టాఫీస్ మీదుగా టవర్ సర్కిల్ దాకా నిర్వహించిన ఈ ర్యాలీ ఒక ప్రభంజనంగా మారింది. అనంతరం టవర్ సర్కిల్ వద్ద కాషాయ ప్రభంజనాన్ని ఉద్దేశించి బండి సంజయ్, నవనీత్ కౌర్ ప్రసంగించారు.

బండి సంజయ్ చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు....అభివృద్ధి నినాదంతో మేం ప్రజల వద్దకు పోతే కరీంనగర్ ఎన్నికలకు వెళితే ఏం జరుగుతోందో... ఏ విధంగా కాషాయ సంద్రమైందో చూస్తున్నారు కదా... కరీంనగర్ కార్పొరేషన్ లో బీజేపీ 50 సీట్లు గెలిచి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోబోతోందని సర్వేలన్నీ తేల్చడంతో కాంగ్రెస్, ఎంఐఎం నేతల వెన్నులో వణుకు మొదలైంది.అందుకే ఒవైసీ నిన్న రాత్రి కరీంనగర్ కు వచ్చి ఎంఐఎం గేర్ మారుస్తుందని మాట్లాడుతున్నడు.అరే ఒవైసీ.. కరీంనగర్ లో ఆల్రెడీ కబడ్డీ ఆట మొదలెట్టినం బేటా.. మా కరినగర ప్రజలంతా... బీజేపీ .. బీజేపి అనే కూత కూస్తున్నారు. బైరి కొస్తున్నారు. ఆ కూత పాత బస్తీదాక వినపడే సరికి భయపడి నువ్వు కరీంనగర్ కి ఉరికొచ్చినవ్ బిడ్డా.. నీకు నీ చెయ్యి పట్టుకుని నడిపిస్తున్న కాంగ్రెస్. . పార్టీకి, కరీంనగర్ లో బండి సంజయ్ కార్పొరేషన్ లో ఆడుతున్న కబడ్డీ ఆట గుర్తొచ్చి.. ఒకరి వెనుక ఇంకొకరు ఇక్కడికి ఉరికొచ్చిండ్రు.. కదా..! కరీంనగర్లో బీజేపి ఆడుతున్న కబడ్డీ ఆటకు నీ చోటా బాయి రేవంత్ రెడ్డి ఈడకు రాలేక చొప్పదండి నుండే పారిపోయి నిన్ను పంపిండా?ఈ కబడ్డీ ఆటలో ఇండియా టీం పక్షాన బీజేపీ ఆడుతుంటే... పాకిస్తాన్ టీం పక్షాన కాంగ్రెస్, ఎంఐఎం కలిసి అడుతున్నయ్. బీజేపీ టీంను ఓడించేందుకు నిన్న రాత్రి కాంగ్రెస్, ఎంఐఎం నేతలు రహస్యంగా సమావేశమై రూ.100 కోట్ల (డీల్) మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నరు. రూ.100 కోట్లు ఖర్చు పెట్టి అయినా సరే ఓట్లు కొనుగోలు చేసి బీజేపీని ఓడించాలని కుట్రకు ప్లాన్ చేశారు. వాళ్లు ఎన్ని కుట్రలు చేసిన ఈనెల 11న జరిగే ఫైనల్ లో బీజేపీ టీం కబడ్డీ కప్ గెలుచుకోవడం తథ్యం. బండి సంజయ్ కు, బిజెపి వాళ్లు వాళ్ల భార్యల కంటే నన్నే ఎక్కువ ఇష్టపడతారని ఒవైసీ మాట్లాడుతున్నడు. అరే ఓవైసీ... నీకు తెలుసా? బీజేపీ నేతలకు కుటుంబం కంటే.. దేశం, ధర్మమే ముఖ్యం.. దుష్ట శిక్షణ కోసం కొన్నిసార్లు ఇంటిని కూడా మర్చిపోతం. రామాయణం లో రాముడికి ఎప్పుడు రావణుడే గుర్తొచ్చాడు కదా.. మహాభారతం లో పాండవులకు కౌరవులే గుర్తొచ్చారు కదా. ఈ బండి సంజయ్ కు కూడా ఒవైసీనే గుర్తుకొస్తున్నడు. రామాయణం, మహాభారతంలో రావణుడు, కౌరవులకు ఏం గతి పట్టిందో ఎంఐఎంకు కూడా అదే గతి పట్టించేదాకా విశ్రమించే ప్రసక్తే లేదు.నా కరీంనగర్ ప్రజలారా... ఈ కరీంనగర్ కు రక్షణ కవచంగా నేనుంటా.

మీ జెండాలను పక్కన పెట్టండి. అందరూ ఒక్కటై ఆ రెండు పార్టీలకు బుద్ది చెప్పండి. ట్రిపుల్ తలాఖ్ రద్దుతో ముస్లిం మహిళల జీవితాల్లో వెలుగు నింపుతోంది మోదీ ప్రభుత్వం. ముస్లిం మహిళలు సైతం ఎంఐఎంను ఛీ కొట్టి బీజేపీవైపు నడుస్తుంటే... ఓర్వలేక ఎంఐఎం నేతలు కాంగ్రెస్ తో కలిసి బీజేపీని దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నాయి. కరీంనగర్ కార్పొరేషన్, టవర్ సర్కిల్ మీద పొరపాటున మజ్లిస్ పచ్చ జెండా ఉంటే ఎట్లుంటదో ఆలోచించండి. అదే సమయంలో ఈ కార్పొరేషన్, టవర్ సర్కిల్ పై కాషాయ జెండా రెపరెపలాడుతుంటే ఎంతటి కనువిందు చేస్తుందో ఆలోచించాలని కోరుతున్నా.మున్సిపల్ ఎన్నికలకు ఇంకా ఉన్నది రెండ్రోజులే. మీడియా, సోషల్ మీడియా కార్యకర్తలతోపాటు యువకులంతా ఈ రెండ్రోజుల సమయం మాకు ఇవ్వండి. రాజకీయాలకు అతీతంగా బీజేపీని గెలిపించండి. ఈ కరీంనగర్ కు రక్షణ కవచంగా నేను ఉంటా. వాడవాడలా, బూత్ బూత్ లో తిరిగి ప్రతి ఒక్కరినీ కలిసి కాంగ్రెస్, ఎంఐఎం కుట్రలను, మతం పేరుతో మారణ హోమం సృష్టించడానికి జరుగుతున్న కుట్రలను వివరించండి. బీజేపీని గెలిపించండి.కరీంనగర్ లో కాంగ్రెస్, ఎంఐఎం కలిసి వచ్చినా, కుట్రలు చేసినా ఒక్క సీటు కూడా గెలవలేకపోయిందని నిరూపించండి. నరేంద్రమోదీ ఎదుట గల్లా ఎగరేసి చెప్పుకునే అవకాశం ఇవ్వండి. కులాలు, వర్గాలు, వర్ణాల, డివిజన్ల పేరుతో విడిపోతే పచ్చ పార్టీ గెలిస్తే కరీంనగర్ పరిస్థితి ఎట్లుంటదో ఒక్కసారి ఆలోచించండి. ఈ నెల 11 న జరిగే పోలింగ్ నాడు దేశాన్ని, ధర్మాన్ని, మన హిందూ సమాజాన్ని గుర్తు చేసుకుని కమలం పువ్వు గుర్తుకు ఓటేయాలని కోరుతున్నా..

# టూ టైర్ సిటీస్ లో రియల్

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 09:

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన టైర్-2 నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వరంగల్, కరీంనగర్, తిరుపతి వంటి నగరాల్లో ఓపెన్ ప్లాట్ల వ్యాపారం గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 15 శాతం వృద్ధిని నమోదు చేసింది. హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో ధరలు సామాన్యులకు అందుబాటులో లేకపోవడం, ఐటీ , పారిశ్రామిక రంగాలు ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరిస్తుండటంతో పెట్టుబడిదారులు ఇప్పుడు ఈ ప్రాంతాల వైపు మొగ్గు చూపుతున్నారు.ముఖ్యంగా మధ్యతరగతి వర్గాల వారు భవిష్యత్తు అవసరాల కోసం ఈ నగరాల శివార్లలో ప్లాట్లు కొనడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. తెలంగాణలో హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరంగా ఎదుగుతున్న వరంగల్‌లో రియల్ ఎస్టేట్ బూమ్ కనిపిస్తోంది. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ,వరంగల్ ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణ వార్తలు ఇక్కడి భూముల ధరలకు రెక్కలు తెచ్చాయి. కరీంనగర్‌లో ఐటీ టవర్లు, పర్యాటక రంగ అభివృద్ధి వల్ల పట్టణ సరిహద్దులు వేగంగా విస్తరిస్తున్నాయి. గతంలో కేవలం వ్యవసాయ భూములుగా ఉన్న ప్రాంతాలు నేడు డీటీసీపీ అనుమతి పొందిన లేఅవుట్లుగా మారుతున్నాయి. ఇక్కడ గత ఏడాదితో పోలిస్తే ప్లాట్ల అమ్మకాల్లో సుమారు 14 నుంచి 16 శాతం వరకు ధరల పెరుగుదల కనిపించడం గమనార్హం.ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో కూడా ఇదే విధమైన ట్రెండ్ కొనసాగుతోంది. ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో పాటు, అక్కడ ఏర్పాటవుతున్న కొత్త టౌన్‌షిప్‌లు ,పారిశ్రామిక కారిడార్లు రియల్ ఎస్టేట్ వృద్ధికి ప్రధాన కారణమయ్యాయి. తిరుపతి-మదనపల్లి , తిరుపతి-చెన్నై హైవేల వెంట వెలుస్తున్న ఓపెన్ ప్లాట్ వెంచర్లకు డిమాండ్ భారీగా పెరిగింది.ఈ నగరాల్లో 15 శాతం వృద్ధి నమోదు కావడానికి మెరుగైన కనెక్టివిటీ ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. కొత్తగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్లు, అండర్ పాస్లు ,మెరుగైన డ్రైనేజీ వ్యవస్థలు పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పెంచాయి. అపార్ట్‌మెంట్ల కంటే ఓపెన్ ప్లాట్లపై పెట్టుబడి పెడితే తక్కువ కాలంలోనే ఎక్కువ లాభం వస్తుందని భావించడం కూడా ఈ రంగం పుంజుకోవడానికి కారణం.

# భారత్ తో మ్యాచ్ పై పాక్ యూ టర్న్..

లాహోర్,కరీంనగర్

ఫిబ్రవరి 15న భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బహిష్కరించాలని పాకిస్థాన్ ఇప్పటికే నిర్ణయించుకుంది. దీంతో ఈ నిర్ణయం ప్రస్తుతం 2026 టీ20 వరల్డ్‌కప్ మొదలయ్యాక మరోసారి ఉత్కంఠభరితంగా మారింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు బంగ్లాదేశ్ క్రికెట్



బోర్డు (బీసీబీ) అధ్యక్షుడు అమినుల్ ఇస్లాం బుల్బుల్ కీలక సమావేశం కోసం లాహోర్‌కు వెళ్లాడు. బీసీబీ ? పీసీబీ మధ్య జరగనున్న సమావేశానికి ఇద్దరు ఐసీసీ అధికారులు కూడా లాహోర్‌కు వెళు న్నారు.భద్రతా కారణాలు చూపిస్తూ, గ్రూప్ దశ మ్యాచ్‌ల కోసం భారతదేశానికి తమ జాతీయ జట్టును పంపేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ మద్దతుతో) నిరాకరించింది. టోర్నమెంట్ సహ-ఆతిథ్య దేశమైన శ్రీలంకకు తమ మ్యాచ్‌లను మార్చాలని బీసీబీ అధికారికంగా ఐసీసీని కోరింది.అయితే, స్వతంత్ర భద్రతా సమీక్షలో ఎలాంటి ప్రత్యేక ముప్పు లేదని తేలడంతో, అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. జనవరి చివర్లో పాల్గొనాల్సిన గడువు మిస్ కావడంతో, ఐసీసీ బంగ్లాదేశ్‌ను ఈ ద్వైవార్షిక టోర్నమెంట్ నుంచి తప్పించి, గ్రూప్?సీలో స్కాట్లాండ్‌ను చేర్చింది.

పాకిస్థాన్ జోక్యంతో వివాదం..

పాకిస్థాన్ ప్రభుత్వం, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) బంగ్లాదేశ్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించాయి. ఫిబ్రవరి 15న కొలంబోలో భారత్‌తో జరగాల్సిన కీలక మ్యాచ్‌ను బహిష్కరించాలని జాతీయ జట్టుకు ఆదేశించినట్లు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ధృవీకరించిన సంగతి తెలిసిందే.బంగ్లాదేశ్‌ను టోర్నమెంట్ నుంచి తప్పించడం "అన్యాయం", "రాజకీయ ప్రేరేపిత నిర్ణయం" అని పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నక్వీ విమర్శించారు. భద్రతపై అనుమానాలు ఉన్న చోట ఆడమని ఏ క్రికెట్ బోర్డుపై ఒత్తిడి తేవడం సరికాదని ఆయన వ్యాఖ్యానించారు.బుల్బుల్ ? నక్వీ సమావేశం ప్రస్తుత గొడవకు ఫుల్ స్టాప్ పెట్టడమే లక్ష్యంగా జరగనుంది. ఆ తర్వాత ఇరు దేశాల బోర్డులు కలిసి ఐసీసీ అధికారులతో సమావేశమై ఏకాభిప్రాయంతో తమ వాదనను వినిపించనున్నట్లు తెలుస్తోంది.క్రికెట్ ప్రపంచం మొత్తం ఈ పరిణామాలను ఆసక్తిగా గమనిస్తోంది. టోర్నమెంట్‌లో అత్యంత భారీ వాణిజ్య విలువ కలిగిన భారత్ ? పాకిస్థాన్ మ్యాచ్‌కు కేవలం వారం రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో, టోర్నమెంట్ ప్రతిష్టకు భంగం కలగకుండా అన్ని పక్షాలను సంతృప్తిపరిచే పరిష్కారం కనుగొనాల్సిన ఒత్తిడి ఐసీసీపై భారీగా ఉంది.భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించే ప్రణాళికను కొనసాగిస్తే తీవ్ర శిక్షలు తప్పవని ఐసీసీ ఇప్పటికే పీసీబీని హెచ్చరించింది. భారీ ఆర్థిక జరిమానాలు, పాయింట్ల కోల్పోవడం నుంచి భవిష్యత్తు అంతర్జాతీయ టోర్నమెంట్‌ల ఆతిథ్య హక్కులు కోల్పోవడం వరకు, అవసరమైతే బోర్డు సభ్యత్వాన్ని కూడా నిలిపివేసే అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేసింది.

వైఖరి మార్పుపై ఐసీసీ ఆశలు..

ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా కూడా కొలంబోకు వెళ్లి శ్రీలంక క్రికెట్ బోర్డు అధ్యక్షుడు షమ్మీ సిల్వాను కలిశారు. షమ్మీ సిల్వానే భారత్‌తో వరల్డ్‌కప్ మ్యాచ్ ఆడాలని పీసీబీ చైర్మన్ నక్వీకి ఈమెయిల్ పంపినట్లు సమాచారం.'ఫోర్స్ మేజ్యూర్' నిబంధనను ఆధారంగా చూపిస్తూ భారత్‌తో టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్ ఆడకపోవడానికి పాకిస్థాన్ ప్రయత్నించడంపై ఐసీసీ ఇప్పటికే వివరణ కోరింది. ప్రభుత్వంపై బాధ్యత నెట్టివేసి పీసీబీ ఈ పరిస్థితి నుంచి తప్పించుకోవాలని ప్రయత్నించిందని ఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసింది.అయితే, తాజా సమాచారం ప్రకారం పీసీబీ చర్చల కోసం ఐసీసీని సంప్రదించడంతో కొంత ఆశ కనిపిస్తోంది. చివరకు ఆ 'మార్కీ క్లాష్' (భారత్ ? పాకిస్థాన్ మ్యాచ్) జరుగుతుందని ఒక ఐసీసీ డైరెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# భారత్, అమెరికా ట్రేడ్ డీల్...

## తగ్గనున్న ఆహార పదార్థాలు...

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 09:

భారత్-అమెరికా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందం జరిగినట్లు రెండు దేశాలు ప్రకటనలు విడుదల చేశాయి. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు అమెరికా నుంచి భారత్‌లోకి దిగుమతి అయ్యే ఆహార పదార్థాల ధరలు దిగిరానున్నాయి. అయితే భారత రైతులకు ఎలాంటి నష్టం లేకుండా.. కొన్ని వస్తువులపై మాత్రమే సుంకాలను ఈ ఒప్పందంలో భాగంగా తగ్గించారు. ఈ క్రమంలోనే ఇప్పుడు ఏ ఏ ఆహార వస్తువుల ధరలు తగ్గుతాయి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం. భారత్‌పై సుంకాల మోత మోగించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇటీవలె 50 శాతం నుంచి సుంకాలు 18 శాతానికి తగ్గించినట్లు వెల్లడించారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత.. ఇటీవల భారత్-అమెరికా మధ్య కుదిరిన కొత్త తాత్కాలిక వాణిజ్య ఒప్పందం కారణంగా అమెరికా నుంచి భారత్‌లోకి దిగుమతి అయ్యే పలు రకాల ఆహార పదార్థాల ధరలు తగ్గి.. ఊరట కలగనుంది. అయితే దేశ ప్రధాన వ్యవసాయ రంగానికి ఎలాంటి నష్టం కలగకుండా.. కొన్ని వస్తువులపై మాత్రమే సుంకాలను తగ్గించి.. ధరలు దిగివచ్చేలా ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. అమెరికా సుంకాలు తగ్గించినందుకు బదులుగా.. అమెరికా నుంచి భారత్‌కు వచ్చే కొన్ని ఆహార, పారిశ్రామిక ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను తగ్గించడం లేదా తొలగించడం చేయాల్సి ఉంటుంది.ఏ ఏ ఆహార పదార్థాల ధరలు తగ్గుతాయి?

డ్రై ఫ్రూట్స్

అమెరికా నుంచి భారత్‌లోకి దిగుమతి అయ్యే బాదం, పిస్తా, వాల్‌నట్స్ వంటి డ్రై ఫ్రూట్స్ ధరలు దిగి రానున్నాయి.

పండ్లు

యాపిల్స్, తాజా పండ్లు, ప్రాసెస్ చేసిన పండ్లపై దిగుమతి సుంకాలు తగ్గనున్నాయి. అయితే భారతదేశ రైతులను కాపాడేందుకు వీటిపై కనీస దిగుమతి ధర రూల్ మాత్రం కొనసాగుతుంది.

సోయాబీన్ ఆయిల్

భారత్‌లో వంట నూనెల అవసరాలు చాలా ఎక్కువగా ఉన్నందున.. అమెరికా నుంచి వచ్చే సోయాబీన్ ఆయిల్‌పై భారత్ సుంకాలను తగ్గించింది.

పశువుల దాణా

పశువులు, కోళ్ల మేతలో వాడే ప్రోటీన్ పదార్థాలు, ఎర్ర జొన్నలపై దిగుమతి సుంకాలు తగ్గుతాయి. దీనివల్ల దాణా తయారీ ఖర్చు తగ్గి.. పరోక్షంగా దానిపై ఆధారపడే పలు రంగాలకు భారీ ఊహట కలగనుంది.

వైన్, స్పిరిట్స్

అమెరికన్ వైన్, ఇతర స్పిరిట్‌ల ధరలు కూడా తగ్గనున్నాయి. కనీస దిగుమతి ధర కొనసాగుతున్నప్పటికీ.. భారత మార్కెట్లో ఇలాంటి డ్రింక్స్ ధరలు తగ్గే అవకాశాలు ఉన్నాయి.

కొన్ని వస్తువులపై పాత సుంకాలే

అయితే భారతదేశంలో ఎక్కువ శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తారు. అమెరికా నుంచి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై సుంకాలు తగ్గించడం, పూర్తిగా తొలగించడం వల్ల మన దేశ రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అనేక భయాందోళనలు వ్యక్తం అయిన సంగతి తెలిసిందే. దీంతో మోదీ సర్కార్ అలర్ట్ అయింది. అత్యంత సున్నితమైన వ్యవసాయ రంగాలపై ఎలాంటి ఎఫెక్ట్ పడకుండా చూసేందుకు ఆయా ఉత్పత్తులపై పాత సుంకాలే కొనసాగుతాయని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది.

ప్రధాన ధాన్యాలు

గోధుమలు, వరి, మొక్కజొన్న, చిరుధాన్యాలైన జొన్న, సజ్జ, రాగి, కొర్రలు, బార్లీ, ఓట్స్ వంటి ఉత్పత్తులు ఈ వాణిజ్య ఒప్పందం నుంచి మినహాయించారు. దీనివల్ల వీటికి పాత సుంకాలే అమలు కానున్నాయి.

పాల ఉత్పత్తులు

పాలు, వెన్న, నెయ్యి, పెరుగు, వెన్న నూనె వంటి ఉత్పత్తులపై పూర్తి రక్షణ కల్పించారు.

మాంసం, కూరగాయలు

చికెన్, ఇతర మాంసాలు, బంగాళాదుంపలు, బఠానీలు, చిక్కుళ్లు, పుట్టగొడుగులు వంటి వాటిపై పాత సుంకాలే అమలు కానున్నాయి.

మరోవైపు.. తాజాగా కుదిరిన ట్రేడ్ డీల్‌లో భాగంగా అమెరికా కూడా కొన్ని భారతీయ ఉత్పత్తులపై సుంకాలను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గించింది. ఇందులో టెక్స్‌టైల్స్, లెదర్, ఫార్మాస్యూటికల్స్, విమాన విడిభాగాలు మొదలైనవి ఉన్నాయి. వీటివల్ల భారతీయ చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్‌ఎంఈ) భారీగా లబ్ధి చేకూరుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

=============

# మాటల్లేవా....

గుంటూరు, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 09:

తెలుగు సినిమా ఇండస్ట్రీలో పవన్ కళ్యాణ్ కి చాలా మంచి క్రేజ్ అయితే ఉంది. ఆయన నుంచి వచ్చిన ప్రతి సినిమాలో ఏదో ఒక వైవిధ్యమైతే ఉంటుంది. ప్రతి ప్రేక్షకుడిని థియేటర్ కి రప్పించడం ఆయన కీలకపాత్ర వహిస్తూ ఉంటాడు?అలాంటి పవన్ కళ్యాణ్ నుంచి వచ్చే ప్రతి సినిమా ప్రేక్షకులను మెప్పిస్తుంది. తన అభిమానులు సైతం అతని సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తూ ఉంటారు. గత సంవత్సరం ఓజీ సినిమాతో సూపర్ సక్సెస్ ని సాధించిన ఆయన ఈ సంవత్సరం 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాతో మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు? ఈ సినిమా ఎలా ఉండబోతుంది అనేది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ అటు పాలిటిక్స్ లో బిజీగా ఉంటూనే సినిమాలను చేస్తూనే తన అభిమానులను అలరించే ప్రయత్నం చేస్తున్నాడు?ఇక ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఇండస్ట్రీలో ఉన్న కొంతమంది నటులతో మాట్లాడటం లేదనే వార్తలు వైరలవుతున్నాయి. బేసిగ్గా పవన్ కళ్యాణ్ ఎవరితో గొడవ పెట్టుకోడు. ప్రొఫెషన్ పరంగా మాత్రం ఆయన ఎవరి పని వాళ్ళు చేసుకుంటే బాగుంటుందనే ఆలోచనలో ఉంటాడు.ఇలాంటి నటుడు తన క్లోజ్ ఫ్రెండ్ అయిన అలీ వైసీపీ పార్టీలోకి వెళ్లి పవన్ కళ్యాణ్ దూషిస్తూ కొన్ని మాటలు మాట్లాడడంతో ప్రస్తుతం ఇప్పటికీ అతనితో పవన్ కళ్యాణ్ మాట్లాడడం లేదట. ఒకవేళ అలీ కనక పవన్ కళ్యాణ్ తోనే ఉండుంటే ఇప్పుడు అలీ చాలా మంచి పొజిషన్లో ఉండేవాడు. పాలిటిక్స్ లో కూడా తను రాణించే అవకాశమైతే ఉండేది.కానీ అలా కాకుండా వైసీపీ పార్టీ లోకి వెళ్లి తప్పు పని చేశారని చాలామంది అతన్ని విమర్శిస్తున్నారు. ఇక ఏది ఏమైనా కూడా పవన్ కళ్యాణ్ కి అత్యంత ఆత్మీయుడైన అలీ వేరే పార్టీలో చేరడాన్ని పవన్ కళ్యాణ్ జీర్ణించుకోలేకపోయాడు. అందుకే ప్రస్తుతం పవన్ కళ్యాణ్ అలీతో మాట్లాడడం లేదనే వార్తలు కూడా వస్తున్నాయి?=

# గుబ్బగుర్తిలో రైతుల అందోళన

ఖమ్మం భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 09:

ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామం వద్దు రైతులు ఆందోళన కు దిగారు. గత పది రోజుల నుంచి నాగార్జునసాగర్ కాలువ నీరు రాకపోవడంతో మొక్కజొన్న పంట ఎండిపోతుందని ఏనుకూరు పల్లిపాడు వెళ్లి రహదారిపై రాస్తారోకో చేసారు.

# మున్సిపల్ ఎన్నికల తర్వాతే కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థి ఎంపిక :ఎమ్మెల్యే టీఆర్ఆర్

పరిగి భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 09:

ఎన్నికల్లో ఓటమి భయంతోనే ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిని ఇప్పటికే ప్రకటించిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి మండిపడ్డారు.

కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు ఎవరినీ చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించలేదని ఆయన స్పష్టం చేశారు. ??మా పార్టీ విధానం ప్రకారం ముందుగా మా కౌన్సిలర్ అభ్యర్థులందరూ గెలిచిన తర్వాత, సీనియర్ నాయకులంతా కలిసి చర్చించి, ఆలోచన చేసి అందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తిని మున్సిపల్ చైర్మన్గా ఎన్నుకుంటామని తెలిపారు.

# నక్సలిజంపై కేంద్ర హోంమంత్రి అమిత్షా కీలక సమావేశం

రాయ్ పూర్ భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 09:

నక్సలిజంపై కేంద్ర హోంమంత్రి అమిత్షా కీలక సమావేశం నిర్వహించారు. మార్చి 31 నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ఈ ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. ఛత్తీస్గఢ్లోని రాయ్పుర్లో జరిగిన ఈ సమావేశంలో, నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల పురోగతిని అమిత్షా సమీక్షించారు. తీవ్రవాదంపై చేపట్టిన పోరాటంలో తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిచ్చాయని ఆయన పేర్కొన్నారు.

# వానర మూకల మధ్య ఘర్షణ

జనగామ భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 09:

జనగామ జిల్లాలో రెండు వానర సేనల మధ్య వార్ జరిగింది. దీన్ని చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురైయారు. పాలకుర్తి మండలం వల్మిడిలో ఒకేచోట ఎదురుపడి వందల కోతులు దాడులు చేసుకున్నాయి. పరస్పరం ఒకదానికొకటి కోతులు దాడులు చేసుకోవడంతో భయాందోళనలకు దారితీసాయి. స్థానికులు కోతుల స్వైరవిహారం నుండి తమను రక్షించండి అని వేడుకుంటున్నారు.

# ఇక ఇవాళ్టి నుంచి గ్రేటర్ 3 కార్పొరేషన్లు

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 09:

300 డివిజన్లతో దేశంలోనే అతి పెద్ద మహానగరంగా విస్తరించిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్?(జీహెచ్ఎంసీ)ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 10వ తేదీన మూడు కార్పొరేషన్లుగా విభజించనుంది. ఈ నేపథ్యంలోనే ఆయా కార్పొరేషన్లు ఏ విధంగా ఏర్పాటు కానున్నాయి? వాటి పేర్లు ఏంటి? ఎంత జనాభాతో ఏర్పాటు కాబోతున్నాయనే ప్రశ్నలు హైదరాబాద్? నగరవాసుల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. అదే సమయంలో ప్రస్తుత కార్పొరేటర్ల పదవీకాలం పూర్తవనుండటంతో తర్వాత నగర పాలన ఏ విధంగా ఉండనుందనేటువంటి చర్చ ప్రస్తుతం జరుగుతోంది.17 ఏళ్ల తర్వాత ప్రత్యేక అధికారి పాలన : భాగ్యనగరంలో? 17 ఏళ్ల తర్వాత స్పెషల్ ఆఫీసర్ పాలన రాబోతుంది. పాలకమండలి లేనప్పుడు మేయర్‌కు సమాన హోదాలో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు ప్రత్యేక అధికారులను నియమించి పరిపాలనను నిర్వర్తిస్తుంది. చివరి సారిగా 2008 సెప్టెంబరు 4వ తేదీ నుంచి 2009 డిసెంబరు 4వ తేదీ వరకు ఎస్.పి.సింగ్ కమిషనర్, ప్రత్యేక అధికారి హోదాలో జీహెచ్ఎంసీ పరిపాలన బాధ్యతలను చేపట్టారు. ఆయనకు ముందు అంటే 12 మున్సిపాలిటీలను హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసి జీహెచ్ఎంసీని ఏర్పాటు చేసినప్పుడు గ్రేటర్ హైదరాబాద్ మొట్టమొదటి కమిషనర్, స్పెషల్ ఆఫీసర్?గా సి.వి.ఎస్.కె.శర్మ నియామకం అయ్యారు. ఆయన 2007 ఏప్రిల్ 16వ తేదీ నుంచి 2008 సెప్టెంబరు 4వ తేదీ వరకు పని చేశారు.పాత జీహెచ్ఎంసీలో రమారమి కోటి మంది జనాభా ఉండేది. ప్రస్తుత జీహెచ్ఎంసీ పరిధిలో 1.34కోట్ల మంది జనాభా ఉంది. అప్పుడు 150 డివిజన్లు ఉండగా డివిజన్ల పునర్విభజనలో భాగంగా అవి 253కు పెరిగాయి. పాత నగరంలో జనాభా అధికంగా ఉన్నందువల్ల డివిజన్ల సంఖ్య దాదాపు రెట్టింపయినట్లుగా అధికారులు వివరిస్తున్నారు. గ్రేటర్ పరిధిలో విలీనమైన 27 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో జనాభా అంతంతమాత్రమే. పాత గ్రేటర్ హైదరాబాద్?తో పోలిస్తే ఆయా స్థానిక సంస్థలు రెట్టింపు విస్తీర్ణంలో ఉన్నాయి. జనాభా మాత్రం 30లక్షలే. వాటి పరిధిలో 47 డివిజన్లు ఏర్పాటయ్యాయి.గతేడాది డిసెంబరు 3వ తేదీన జీహెచ్ఎంసీ 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 డివిజన్లతో అతిపెద్ద నగరపాలక సంస్థగా ఆవిర్భవించింది. ప్రస్తుత జీహెచ్ఎంసీని 70లక్షల జనాభాతో కూడిన 6 జోన్లకు పరిమితం చేసి సగటున 35 లక్షల జనాభా ఉండేవిధంగా మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్లను 3 జోన్ల చొప్పున ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం.

జీహెచ్ఎంసీ కార్పొరేషన్? : శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, ఖైరతాబాద్, గోల్కొండ, సికింద్రాబాద్

మల్కాజిగిరి కార్పొరేషన్ (ఎంఎంసీ) : మల్కాజిగిరి, ఎల్బీనగర్, ఉప్పల్

సైబరాబాద్ కార్పొరేషన్ (సీఎంసీ) : కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్

: రాజధాని హైదరాబాద్ నగర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిన విషయం విదితమే. దీనిలో భాగంగానే బాహ్యవలయ రహదారి(ఓఆర్?ఆర్) పరిధిలో ఉన్న 27 పురపాలికలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్?లో విలీనం చేసింది. దాంతో ఓ దశలో జీహెచ్ఎంసీ దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ కానుందనే ప్రచారం జరిగింది. కానీ, పరిపాలనా సౌలభ్యం కోసం దీన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పరిపాలన సజావుగా సాగేందుకు హైదరాబాద్ పరిధిలో పోలీసు, పురపాలక శాఖల సరిహద్దులు ఒకేవిధంగా ఉండేలా చూడాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది. ఇటీవలే రాజధాని పరిధిలోని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లను పునర్వ్యవస్థీకరించింది. హైదరాబాద్ పరిధిని పెంచడంతో పాటు రాచకొండను మల్కాజిగిరిగా మార్చనున్నట్లుగా సమాచారం.

==================

# కమిషనర్ల ఏర్పాటుకు కసరత్తు

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 09:

అధికారికంగా గ్రేటర్ హైదరాబాద్? మున్సిపల్? కార్పొరేషన్? మూడు మహా నగరపాలక సంస్థలుగా ఏర్పాటు కాలేదు గానీ పరిపాలన మాత్రం ఆ మేరకు మెల్లగా పట్టాలెక్కుతున్నట్లు కనబడుతుంది. మూడు జోన్లకు ఓ అదనపు కమిషనర్ చొప్పున నియమించిన ఆ ఇద్దరు అధికారులకు శనివారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ పరిపాలన బాధ్యతలపై స్పష్టమైన వివరాలను ఇచ్చారు. మీకు కేటాయించిన జోన్లకు సంబంధించిన పరిపాలన వ్యవహారాలను చక్కదిద్దుకోవాలని, జోనల్ కమిషనర్లతో పని చేయించుకోవడం మీ బాధ్యతే అని టెలీ కాన్ఫరెన్స్‌లో వారికి పలు రకాల సూచనలు చేశారు. కొనసాగింపుగా ఆయా జోన్ల పరిపాలన, ఆర్థిక, టౌన్ ప్లానింగ్ విభాగాలకు ఉన్నతాధికారులను సైతం నియమించారు.

ప్రస్తుతం జీహెచ్?ఎంసీలో 12 జోన్లు, వాటి పరిధిలో 60 సర్కిళ్లు ఉన్నాయి. జీహెచ్ఎంసీ పరిధి శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, ఖైరతాబాద్, సికింద్రాబాద్, గోల్కొండ జోన్లకు పరిమితం కానుంది. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్లతో గ్రేటర్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీసీఎంసీ), మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్బీనగర్ జోన్లతో గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(జీఎంఎంసీ) ఏర్పాటవుతాయని తెలుస్తోంది. జీఎంఎంసీ పరిధి అదనపు కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, జీసీఎంసీ పరిధికి ప్రస్తుత అదనపు కమిషనర్ సృజనని కమిషనర్లుగా నియమిస్తూ పాలకమండలి పూర్తయ్యాక ఉత్తర్వు వెలువడుతుందని విశ్వసనీయ వర్గాల సమాచారంనూతన గ్రేటర్ కార్పొరేషన్ల టౌన్ ప్లానింగ్ వ్యవహారాల నిర్వహణను ఇద్దరు డైరెక్టర్ హోదాలో ఉన్న అధికారులకు అప్పగిస్తూ కమిషనర్ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇకపై ఆయా జోన్ల పరిధిలోని నిర్మాణ అనుమతుల దరఖాస్తులు వారి ద్వారానే కమిషనర్ పర్మిషన్?కు వెళ్లనున్నాయి.విలీనంతో 300 డివిజన్ల పరిధిలోని నగరానికి 20శాతం మేర ఉద్యోగుల కొరత ఏర్పడింది. పారిశుద్ధ్య, టౌన్‌ప్లానింగ్ విభాగాల్లో ఎక్కువ ఖాళీలు ఉన్నాయని అధికారులు లెక్కలను తేల్చారు.

మరో 1,500 మంది అవసరమని, ఉన్నతాధికారులతో తక్షణమే కమిటీ వేయాలని నిర్ణయించారు.జీహెచ్?ఎంసీ పాలకమండలి గడువు వచ్చే ఫిబ్రవరి 10తో ముగియనుంది. తర్వాత 300 డివిజన్లను మూడు భాగాలుగా చేసే ప్రక్రియ అధికారికంగా మొదలుకానుంది. మార్చి లేదా ఏప్రిల్‌లో ఎన్నికలు ఉంటాయనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. జులై నాటికి నిర్వహించకపోతే 2027 వరకు జరిగే అవకాశం ఉండదని సంబంధిత అధికారులు పలు విశ్లేషణలు చేస్తున్నారు. జనగణన పూర్తవుతుందని, కొత్త జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన చేపట్టి ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని చెబుతున్నారు.వంద, రెండు వందలు కాదు. ఏకంగా 4 వేలకుపైగా ఫిర్యాదులు జీహెచ్?ఎంసీ విస్తరణ సమస్యపై బుట్ట దాఖలయ్యాయి. డివిజన్లు పెంచండి, హద్దులు మార్చండంటూ రాజకీయ నేతలు, శివారు ప్రాంత ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను జీహెచ్ఎంసీ నిర్మొహమాటంగా తిరస్కరించడం పట్ల వారిలో ఆందోళన నెలకొంది. అందులో 90 శాతం అర్జీలు వేర్వేరు రాజకీయ పార్టీల నేతలవి కావడం గమనార్హం. ముందుగా నిర్ణయించుకున్నట్లుగానే డివిజన్ల పునర్విభజనను పూర్తి చేశారనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపస్తున్నాయి. జనాభా, విస్తీర్ణం దృష్ట్యా సమతూకం పాటించలేదని కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలే కాకుండా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కూడా జీహెచ్?ఎంసీ విస్తరణను సవరించాలని కోరుతున్నారు.

ఈ విస్తరణతో జీహెచ్ఎంసీ పరిధితో సరిపడా భూలభ్యత, రవాణా, నివాసం, వర్షపు నీటి పారుదల, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో సమగ్ర మెట్రోపాలిటన్ ప్రణాళికలు అమలు చేసే అవకాశం ఉంది. అలాగే కొత్తగా విలీనమైన ప్రాంతాలకు జీహెచ్ఎంసీ నిధులు, సాంకేతిక నైపుణ్యం, పారిశుధ్యం, దోమల నివారణ, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్రజారోగ్యం, అత్యవసర సేవలు వంటి ప్రామాణిక పౌర సేవలు మరింత మెరుగ్గా అందే అవకాశం ఉంది. ప్రపంచస్థాయి మెట్రోపాలిటన్ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే దిశగా ఈ ప్రక్రియ కీలక ఘట్టమని ప్రభుత్వం భావిస్తోంది.

# పోలింగ్ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించాలి: జనరల్ అబ్జర్వర్ ఉదయ్ కుమార్

## – పోలింగ్‌కు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన అవసరం: అడిషనల్ కలెక్టర్ పాండు




సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 09 :ఎన్నికలలో అత్యంత కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని మైక్రో అబ్జర్వర్లు నిశితంగా పరిశీలించాలని జనరల్ అబ్జర్వర్ ఉదయ్ కుమార్ సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు తు.చ తప్పకుండా అమలయ్యేలా, ప్రశాంత వాతావరణంలో నజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆయన హితవు పలికారు.

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సూక్ష్మ స్థాయిలో పరిశీలించేందుకు నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఎన్నికల సాధారణ పరిశీలకులు ఉదయ్ కుమార్ హాజరై మైక్రో అబ్జర్వర్లకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మైక్రో అబ్జర్వర్లు పరిశీలకులుగా మాత్రమే వ్యవహరించాలని, ఓటింగ్ మరియు కౌంటింగ్ రోజుల్లో పూర్తిస్థాయి ప్రక్రియను గమనించి, గమనించిన అంశాలపై నివేదికలను లిఖితపూర్వకంగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. మైక్రో అబ్జర్వర్లు తమ విధులు, బాధ్యతల పరిధిలోనే పనిచేయాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ, సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియను అనుసరించి ఆయా మున్సిపాలిటీల పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లకు బాధ్యతలు కేటాయించడం జరుగుతుందన్నారు. పోలింగ్‌కు సంబంధించిన ప్రతి అంశంపై మైక్రో అబ్జర్వర్లు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే పోలింగ్ తీరుతెన్నులను సమర్థవంతంగా పరిశీలించగలుగుతారని అన్నారు. పోలింగ్ ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకంగా జరుగుతోందా లేదా అన్నది నిశితంగా పరిశీలించాలని, గమనించిన అంశాలను వెంటనే జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోలింగ్ పూర్తయ్యే వరకు అన్ని అంశాలను జాగ్రత్తగా గమనిస్తూ, ఓటింగ్ గోప్యతను కాపాడే విధంగా మైక్రో అబ్జర్వర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. మాస్టర్ ట్రైనర్ కృష్ణ కుమార్ మైక్రో అబ్జర్వర్ల విధులు, బాధ్యతలు , తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ శిక్షణ తరగతుల్లో ఎన్నికల శిక్షణల నోడల్ అధికారి రామాచారి, డీఈఓ వెంకటేశ్వర్లు, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ నర్సింగ్, మాస్టర్ ట్రైనర్ కృష్ణ కుమార్, మైక్రో అబ్జర్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# గణితంలో ఆర్.సుహాసినికి పీహెచ్డీ

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 09:



గణితంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్.డీ)ని విజయవంతంగా పూర్తిచేసిన డాక్టర్ ఆర్. సుహాసినిని హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అభినందించింది. 'నానోపార్టికల్స్ తో కూడిన సాగే షీటుపై మాగ్నెటోహైడ్రోడైనమిక్ (ఎంహెచ్ డీ) మైక్రోపోలార్ ద్రవ ప్రవాహంపై ఒక సంఖ్యా అధ్యయనం' అనే శీర్షికతో ఆమె పరిశోధన చేసినట్టు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఇది న్యూటోనియన్ కాని ద్రవ గతిశాస్త్రం, వేడి, ద్రవ్యరాశి బదిలీ దృగ్విషయాల అధ్యయనానికి గణనీయమైన తోడ్పాటును అందిస్తుందన్నారు. ఈ పరిశోధన గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, పరిశోధన పర్యవేక్షకుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస రాజు మార్గదర్శనంలో నిర్వహించినట్టు తెలియజేశారు. ఈ అధ్యయనం మాగ్నెటో–మైక్రోపోలార్ నానోఫ్లూయిడ్ ప్రవాహంపై వివిధ భౌతిక పారామితుల ప్రభావాలను విశ్లేషించడానికి అధునాతన సంఖ్యా పద్ధతులను ఉపయోగించిందని, ధృవీకరించిన ఫలితాలు ఇప్పటికే అందుబాటులో ఉన్న సాహిత్యంతో దగ్గరగా ఉన్నాయన్నారు. డాక్టర్ సుహాసిని విజయవంతంగా డాక్టరేట్ డిగ్రీకి అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, ఇతర అధ్యాపకులు తదితరులు ఆమెను హృదయపూర్వకంగా అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అభ్యర్థులను గెలిపిస్తే ప్రతి వార్డుకు 8 కోట్ల నిధులు తీసుకువస్తా: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 9:



సంగారెడ్డి మున్సిపాలిటీలోని 35 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ప్రతి వార్డుకు 8 కోట్ల రూపాయల నిధులను సీఎం దగ్గరికి వెళ్లి తీసుకు వస్తానని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. సదాశివపేట మున్సిపాలిటీలోని గాంధీ చౌక్ వద్ద ప్రజలతో జగ్గారెడ్డి ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడారు. వారి అభిప్రాయాలు అభ్యర్థులు తెలుసుకున్నారు. ఎమ్మెల్యేగా ఉన్నా లేకున్నా ప్రజలకు పనులు చేసి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. సదాశివపేట మున్సిపాలిటీ అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి వద్దకు వెళ్లి 208 కోట్లు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ తోనే మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యమని, తాను ఇచ్చిన మాట తప్పనని పేర్కొన్నారు. 2013లో తాను సదాశివపేట పట్టణంలో నిరుపేదలకు ఐదువేల ఇళ్ల స్థలాలు సర్టిఫికెట్లు ఇచ్చారని చెప్పుకొచ్చారు. కాగా స్థానిక లీడర్ పేదలను ఆ స్థలాల్లోకి రాకుండా తరిమేసాడు అన్నారు. గత పది ఏళ్ల కెసిఆర్ పాలనలో అనుకుంటే పనులు జరిగేవని మున్సిపాలిటీలో ఒక్క పని కూడా చేయకుండా కాలయాపన చేశారని ప్రజలతో తెలిపారు. 2023 ఎన్నికల్లో తనను ఓడించేందుకు హరీష్ రావు సంగారెడ్డికి 27 కోట్లు పంపించాడని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన గెలవకపోయినా ప్రజలకు ఎల్లప్పుడూ పనులు చేసి పెడుతూనే ఉంటానని భరోసా కల్పించారు. కష్టం వస్తే తన ఇంటి తలుపు తట్టాలని ప్రజలకు జగ్గారెడ్డి ధీమా కల్పించారు. తాను ఓట్ల కోసం చెప్పడం లేదని తాను రోజు పాలిచ్చే ఆవునని ఐదేళ్లకోసారి వచ్చి పాలిచ్చే ఆవు కావాలా రోజు పాలిచ్చే ఆవు కావాలో తేల్చుకోవాలని ప్రజలను సూచించారు. మున్సిపాలిటీ అభివృద్ధిని కాంక్షించి 26 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభ్యర్థులు ప్రజలు పాల్గొన్నారు.

# వందేమాతరం ఫోటో ప్రదర్శనను సందర్శించిన కందుల దుర్గేష్, రాష్ట్ర ఉన్నతాధికారులు

నర్సరావుపేట, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 9:



కొండవీడు ఉత్సవాల సందర్భంగా కేంద్ర సమాచార బ్యూరో (సీబీసీ) ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ వరాహ నరసింహ స్వామి దేవస్థాన ప్రాంగణంలో 'ఏక్ పెడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కొండవీడు కోటలోని చారిత్రక 13వ శతాబ్దానికి చెందిన ఆలయ పూజాదికావసరాలను దృష్టిలో ఉంచుకుని, సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ ఆర్. రమేష్ చంద్ర ఆలయ అర్చకులకు సలహా మేరకు ప్రత్యేక రకాల మొక్కలను నాటారు.

కొండవీడు ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీ కందుల దుర్గేష్ కేంద్ర సమాచార బ్యూరో ఏర్పాటు చేసిన 'వందేమాతరం -- 150 సంవత్సరాలు' ఫోటో ప్రదర్శనను సందర్శించారు. చిలకలూరిపేట శాసనసభ్యులు శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు, రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ శ్రీ కృష్ణ తేజ, పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా, పల్నాడు జిల్లాకు చెందిన శాసనసభ్యులు శ్రీ కన్నా లక్ష్మీనారాయణ, డా. చదలవాడ అరవింద్ బాబు, శ్రీ జి.వి. ఆంజనేయులు, జాయింట్ కలెక్టర్ సంజన సింహ కూడా వందేమాతరం చిత్ర ప్రదర్శనను సందర్శించిన వారిలో వున్నారు.

రెండు రోజుల కొండవీడు ఉత్సవాల్లో, వందేమాతరం 150 సంవత్సరాల విస్తృత ఛాయాచిత్ర ప్రదర్శన విద్యార్థులు, పెద్ద సంఖ్యలో సందర్శకులను విశేషంగా ఆకర్షించింది. నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ రావు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, వందేమాతరం ప్రదర్శనలో పొందుపరిచిన సమాచారం, చిత్రాలు అత్యంత విజ్ఞానదాయకంగా, ప్రజలకు జాతీయ చైతన్యం కలిగించేవిగా ఉన్నాయని ప్రశంసించారు.

# కేవైసీ' సంబంధిత మోసాల నివారణపై ప్రత్యేకంగా దృష్టి -ఫిబ్రవరి 9 నుండి ఫిబ్రవరి 13వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు--2026



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఫిబ్రవరి 09: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'సురక్షిత బ్యాంకింగ్‌కు మీ మొదటి అడుగు -- కేవైసీ' అనే ఇతివృత్తంతో ఫిబ్రవరి 9 నుండి ఫిబ్రవరి 13 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు--2026 నిర్వహించాలని ప్రతిపాదించడమైనది.

ఈ వారోత్సవాల సందర్భంగా రీ--కేవైసీ, సీకేవైసీ అప్‌డేషన్, నిద్రాణమైన ఖాతాల పునరుద్ధరణ, ఖాతా నిర్వహణతో పాటు కేవైసీ సంబంధిత మోసాల నివారణపై ప్రత్యేకంగా దృష్టి సారించబడుతుందని తెలియజేయడమైనది. సూచనల మేరకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'ఒక బ్యాంకు శాఖ -- ఒక గ్రామసభ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించడమైనది.

ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు--2026 పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, కామారెడ్డి జిల్లాలోని ప్రజలందరూ కేవైసీ, రీ--కేవైసీని సకాలంలో అప్‌డేట్ చేసుకోవాలని, నిద్రాణమైన ఖాతాలను పునరుద్ధరించుకోవాలని, అలాగే కేవైసీ సంబంధిత సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం కామారెడ్డి జె. చంద్రశేఖర్, కామారెడ్డి బ్రాంచ్ నుండి వి. వినోద్, ఎన్డీసీసీబీ బ్యాంక్ నుండి రాకేష్ కుమార్, యూనియన్ బ్యాంక్ నుండి సుజీత్, ఐఓబి బ్యాంక్ నుండి సాగర్తో పాటు ఇతర బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల కోసం డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట(భారత్ శక్తి జిల్లా ప్రతినిధి)ఫిబ్రవరి 9:

జిల్లాలో ఈ నెల 11న జరుగు మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రతి మున్సిపాలిటీ కేంద్రంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ సముదాయంలోని వి.సి. హాల్ నందు జిల్లా ఎస్పీ, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వెబ్ ఎక్స్ ద్వారా వీడియో కాన్ఫిరెన్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.




ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల సంబంధించి ప్రతి మున్సిపల్ కేంద్రంలో జోనల్ ఆఫీసర్, ఆర్వో ల వారిగా డి.ఆర్.సి.కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఇట్టి కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి మౌలిక సదుపాయాలు మంచినీటి సౌకర్యం, భోజన ఏర్పాట్లు చేయాలని అలాగే పోలింగ్ రోజు కూడ సిబ్బందికి భోజనాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి బ్యాలెట్ బాక్స్ లు, బ్యాలెట్ పేపర్, సిబ్బంది పోలింగ్ కేంద్రానికి ఎస్కార్ట్ వాహనంతో మాత్రమే వెళ్లాలని, ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి టీం సభ్యులు చురుకుగా ఉండి డబ్బు, మద్యం పంపిణీ జరిగితే చర్యలు తీసుకోవాలని, ఈరోజు సాయంత్రం 5 గంటల నుండి ప్రచారం బంద్ చేయాలని అలాగే మున్సిపల్ ఏరియాలో సాయంత్రం 5 గంటల నుండి 11 తారీకు పోలింగ్ ముగిసే వరకు మద్యం షాపులు బంద్ చేయించాలని ఎక్సైజ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్ లను డి జి టి వాహనంలో ముందు, వెనుక ఎస్కార్ట్ వాహనాలతో మాత్రమే స్ట్రాంగ్ రూములకు తరలించాలని, మిగిలిన బ్యాలెట్ పేపర్లను జాగ్రత్తగా కవర్లో పెట్టి సీల్ వేయాలని, పోస్టల్ బ్యాలెట్ పేపర్లను వార్డుల వారిగా విభజించి కౌంటింగ్ కేంద్రాలకు తరలించాలని జోనల్ ఆఫీసర్లు, ఆర్వోలు, ఎన్నికల సిబ్బంది ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి పని చేయాలని, నిబంధనలు అతిక్రమించే సిబ్బందిపై ఎన్నికల సంఘం నిబంధన ప్రకారం చర్యలు తీసుకొబడతాయి కావున ఎన్నికల సిబ్బంది అందరూ బాధ్యతగా పనిచేసి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను దిగ్విజయంగా, విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ వెబ్ ఎక్స్ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కె సీతా రామా రావు, డిప్యూటీ సీఈవో శిరీష, డిపిఓ నారాయణరెడ్డి, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద రాణి, బీసీ సంక్షేమ అధికారి నరసింహ, సి సెక్షన్ సూపరిడెంట్ సంతోష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



హనుమకొండ ప్రతినిధి (భారత శక్తి)ఫిబ్రవరి 9:ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్ ప్రజల నుండి 118 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన అర్జీలను సంబంధిత అధికారులు త్వరగా పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ మనీషా నెహ్రా, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దారులు పాల్గొన్నారు.

# మహిళల పై లైంగిక వేధింపులు అరికట్టాలి : జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఏ ప్రమీల




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఫిబ్రవరి 09: పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల ను అరికట్టుటకు అంతర్గత ఫిర్యాదు కమిటీలను ఏర్పాటు చేయాలనీ జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు.

కామారెడ్డి జిల్లాలో అన్ని కార్యాలయాలు, సంస్థలు, ప్రభుత్వం , ప్రైవేటు రంగాలకు చెందిన సంస్థలలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013 ప్రకారం అశ్లీల వ్యాఖ్యలు, అసభ్య ప్రవర్తన, శారీరక వేధింపులు నేరంగా పరిగణించబడతాయి, కావున తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదు కమిటి ఏర్పాట్లు చేయవలసింధిగా ఆమె తెలిపారు.

She box portal web site:http://shebox.wcd.gov.in

ICC ఏర్పాటు చేసుకోవాలని, icc వివరాలు ష బాక్స్ పోర్టల్ లో నమోదు చేయని సంస్థల పై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు.

ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ప్రైవేటు సంస్థలు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు వెంటనే అంతర్గత ఫిర్యాదు కమిటీని ఏర్పాట్లు చేసి పూర్తి వివరాలు ఆన్ లైన్ షి బాక్స్ పోర్టల్ లొ నమోదు చేయాలని కోరారు. అంతర్గత ఫిర్యాదు కమిటీ సభ్యుల వివరాలు జిల్లా సంక్షేమాధికారి కార్యాలయం లో అందించాలని తెలిపారు, ఈ విషయాన్ని గమనించి తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను, విద్యా సంస్థల యాజమాన్యాలకు తెలియజేశారు.

గమనిక:

షి బాక్స్ పోర్టల్ లో మీ పిర్యాధును నమోదుచేయవచ్చు, స్టేటచూసుకోవచ్చు.

ఫిర్యాదు చేసిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతాము. ఏ ఒక్క మహిళా ఉద్యోగి కూడా భయపడాల్సిన అవసరం లేదు.

కాలపరిమితి: సంఘటన జరిగిన మూడు నెలల లోపు పిర్యాదుచేసే అవకాశం ఉందని తెలిపారు.

కమిటీ సభ్యులు ఈ విధంగా ఉండేలాగా చూసుకోవాలని చెప్పారు:

1 అధ్యక్షురాలు (ప్రెసిడింగ్ ఆఫీసర్) సీనియర్ మహిళా ఉద్యోగి

2 కనీసం 2 సభ్యులు - మహిళా హక్కులు/ సామాజిక సేవలపై అవగాహన ఉన్న ఉద్యోగులు

3. బాహ్య సభ్యుడు - ఎన్ జీఓ / మహిళా సమస్యలపై అనుభవం ఉన్న వ్యక్తి

కమిటీలో కనీసం 50% మహిళలు ఉండాలి. అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన నంబర్లు:

మహిళా హెల్ప్ లైన్ నంబర్181

పోలీస్ హెల్ప్ లైన్లి నెంబర్ 100

## మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి : జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఫిబ్రవరి: మున్సిపల్ ఎన్నికల నిర్వహణ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సంబంధిత నోడల్ అధికారులతో మినీ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశం నిర్వహించారు. డిస్ట్రిబ్యూషన్, పోలింగ్ , కౌంటింగ్ ప్రక్రియల పై సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బిచ్కుంద, బాన్సువాడలలో నిర్వహించనున్న ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన పోలింగ్ సిబ్బంది పంపిణీ (డిస్ట్రిబ్యూషన్), పోలింగ్ నిర్వహణ , ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) ప్రతి దశను పూర్తి పారదర్శకతతో, చట్టబద్ధంగా, లోపాలు లేకుండా నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని, పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ర్యాంపులు, మరుగుదొడ్లు, షామియానా వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని ఎన్నికల నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని అన్నారు.

పోలింగ్ సామగ్రి పంపిణీ సమయంలో చెక్‌లిస్టుల ప్రకారం సరైన పరికరాలు అందజేయాలని, పోలింగ్ రోజున ఓటర్లకు ఇబ్బందులు లేకుండా అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా, గట్టి బందోబస్తు ఏర్పాట్లు ఉండేలా చూడాలని తెలిపారు. పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ బాక్సులను భద్రతతో స్ట్రాంగ్ రూంలకు తరలించి, కౌంటింగ్ రోజున నిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపు జరగాలని స్పష్టం చేశారు.

కౌంటింగ్ హాలులో టేబుల్ ఏర్పాటు, కౌంటింగ్ సిబ్బంది ఏర్పాట్లు, భద్రత చర్యలు, త్రాగునీరు, కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బ్యారికేడ్లు వంటి భద్రతా చర్యలు కట్టుదిట్టంగా అమలు చేయాలని, కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులంతా బాధ్యతతో పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. రేపు మంగళవారం ఎన్నికల అధికారులు సకాలంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు చేరుకొని తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, ఎన్నికల సామగ్రిని సరిచూసుకోవాలని ఉదయం 7.00 గంటలకే డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్, అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్, వివిధ శాఖల నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల అప్పుడే ప్రజలు గుర్తుకొస్తున్నారు: సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 9 :

మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జగ్గారెడ్డి గెలుపు కోసం డ్రామాలు ఆడుతున్నారని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలోనే జగ్గారెడ్డికి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రజలు గుర్తుకు వస్తారని విమర్శించారు. సదాశివపేటలో పేదలకు ఫేక్ సర్టిఫికెట్లు ఇచ్చారని అధికారులు చెప్పిన మళ్లీ ప్రజలను మోసం చేసే ప్రయత్నాలకు తెరతీయడం సిగ్గుచేటు అన్నారు. ఆయన గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పేదలకు ఫ్లాట్లు ఎందుకు అడగలేదు చెప్పాలని ప్రశ్నించారు. కేవలం రెండు మున్సిపాలిటీల్లో గెలవలేమని ముందే తెలిసి ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రెండు మున్సిపాలిటీలపై గులాబీ జెండా రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ టీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ల రాజేందర్ మాజీ సి డి సి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి ఇన్చార్జి రాజనర్సు నాయకులు సోమిరెడ్డి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపు సిబ్బంది తమ విధులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 09 (భారత శక్తి) : మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి తమ బాధ్యతలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.



సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనబోయే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియలో ప్రతి ఓటు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, ఎటువంటి సందేహాలు వచ్చినా పై అధికారులను సంప్రదించి నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. అలాగే సంబంధిత ఫారములను పకడ్బందీగా పూరించి, మొత్తం ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఈవో భోజన్న, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం కప్ లో ప్రతిభ చాటిన రాధికా కాన్సెప్ట్




మణుగూరు, ఫిబ్రవరి 09 (భారతశక్తి): జిల్లా స్థాయిలో జరిగిన క్రీడల్లో, మణుగూరుకి చెందిన రాధికా కాన్సెప్ట్ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. కొత్తగూడెంలోని సిఈఆర్ క్లబ్లో ఆదివారం జరిగిన క్యారంస్ డబుల్స్ గర్ల్స్ విభాగంలో ఎమ్ శాన్వి (9వ తరగతి ) ఎస్ వేదశ్రీ (8వ తరగతి ) కి చెందిన విద్యార్థినులు, అదే విధంగా షటిల్ బ్యాడ్మింటన్ లో గర్ల్స్ విభాగంలో కల్కి, కన్మెశ్రీ విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయిలో జరగబోయే క్రీడలకు ఎంపిక కావడం పట్ల స్కూల్ చైర్మన్ గంగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఇదే పాఠశాల నుంచి మండల స్థాయి, జిల్లాస్థాయి ,రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి క్రీడలకు ప్రాతినిధ్యం వహించిన ఘనతలో రాధికా కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు ముందంజలో ఉన్నారని తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తున్నారని స్కూల్ యాజమాన్యం కొనియాడారు. పాఠశాల చైర్మన్ గంగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, డైరెక్టర్స్ సిహెచ్ జయసింహ రెడ్డి, జి సంపత్ రెడ్డి , నూకారపు రమేష్, బద్దం శ్రీనివాస రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ నరేష్, కోఆర్డినేటర్స్ ఉష, కీర్తి, పాఠశాల పిఈటిలు కె నరేందర్, చంద్రకళ, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు సోమవారం స్కూల్ ఆవరణలో సాధించిన మెడల్స్ ను అందించి అభినందించారు.

## ఫిబ్రవరి 9 సాయంత్రం నుండి ప్రచారాలకు నిషేధం : జిల్లా కలెక్టర్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఫిబ్రవరి 09: మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ముఖ్య సూచనలు



కామారెడ్డి, ఎల్లారెడ్డి, బిచ్కుంద, బాన్సువాడ మున్సిపల్ ఎన్నికల నేపథ్యం లో రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరించి ఫిబ్రవరి 9 సాయంత్రం నుండి ప్రచారాలకు నిషేధం విధించినట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు.

1. ప్రచారంపై నిషేధం

ఫిబ్రవరి 9 సాయంత్రం 5.00 గంటల నుండి ఎన్నికల ముగిసే వరకు, నాలుగు మున్సిపాలిటీలలో ఏవైనా బహిరంగ ఎన్నికల ప్రచారాలు, సమావేశాలు, ఊరేగింపులు మానవీయంగా నిషేధించబడ్డాయి. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, ఎంసిసి బృందాలు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండి కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలనీ కలెక్టర్ సూచించారు.

2. మద్యం, కల్లు దుకాణాల మూసివేత

మున్సిపల్ పోలింగ్ దృష్ట్యా, ఫిబ్రవరి 9 సాయంత్రం 5.00 గంటల నుండి 11వ తేదీ పోలింగ్ ముగిసే వరకు, మద్యం కల్లు దుకాణాలను మూసివేయాలని అలాగే, ఫిబ్రవరి 13న కౌంటింగ్ జరుగుతున్న సందర్భంగా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయడం, డ్రై డే అమలు కొనసాగించడం తప్పనిసరి అని తెలిపారు.

3. ఓటింగ్ కోసం గుర్తింపు కార్డులు

ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల సమయంలో, ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించడానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చినప్పుడు 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి తప్పనిసరిగా తీసుకెళ్ళాలని కలెక్టర్ సూచించారు.

అందులో ముఖ్యమైనవి:ఓటర్ కార్డుఆధార్ కార్డుఉపాధి హామీ జాబ్ కార్డుఫోటోతో కూడిన పోస్ట్ ఆఫీస్ / బ్యాంక్ పాస్‌బుక్‌కార్మిక మంత్రిత్వ శాఖ ద్వారా జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డుడ్రైవింగ్ లైసెన్స్‌పాన్ కార్డులేబర్ గుర్తింపు కార్డుఇండియన్ పాస్‌పోర్ట్ఫోటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్‌కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ గుర్తింపు కార్డుఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఇచ్చిన అధికారిక గుర్తింపు కార్డుదివ్యాంగుల గుర్తింపు కార్డు తదితరాలు.ప్రతి ఓటరు తన ఓటు హక్కును వినియోగించి, ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## నిస్వార్థ ప్రజా సేవకురాలు కుంజా కృష్ణకుమారి: సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కారం పుల్లయ్య




మణుగూరు, ఫిబ్రవరి 09 (భారతశక్తి): అమరజీవి కుంజా కృష్ణకుమారి నిస్వార్థ ప్రజాసేవకురాలని మహిళల హక్కులకై ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహించారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కారం పుల్లయ్య అన్నారు. పోడు భూముల పట్టాల సాధనకై అలుపెరగని పోరాటాలు నిర్వహించి వీర మహిళ గా ప్రజల హృదయాలలో కుంజా కృష్ణకుమారి స్థిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. సోమవారం అమరజీవి కృష్ణకుమారి ద్వితీయ వర్ధంతి పగిడేరు పంచాయితీలో నిర్వహించారు. వర్ధంతి సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సాగునీరు, త్రాగునీరు గ్రామ సమస్యలపై నిస్వార్థ ప్రజా సేవలు అందించిన ప్రజా ప్రతినిధిగా నిరంతరం శ్రమించారని అన్నారు. సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ వీర వనితల పోరాట వారసురాలు కుంజ కృష్ణకుమారి అని కొనియాడారు. కాకతీయుల రాజులపై పోరాటాల నిర్వహించి అమరులైన సమ్మక్క సారక్క వారసురాలుగా వీర తెలంగాణ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం పట్టుదల తెగువ గల పోరాట పటిమగల నాయకురాలుగా కుంజ కృష్ణకుమారి వారసత్వం కొనసాగించాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన కుంజా కృష్ణకుమారి వారసుడు శ్రావణ్ కుమార్ రాజా సర్పంచ్ గా ప్రజలకు నిస్వార్థ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, సీనియర్ నాయకులు కొడిశాల రాములు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బొల్లం రాజు, నాయకులు ఆర్ శ్రీను, గుండి భీమయ్య, కుంజ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన: జిల్లా కాంగ్రెస్ నాయకులు గురిజాల గోపి

మణుగూరు, ఫిబ్రవరి 09 (భారతశక్తి): పట్టణంలోని ఉచిత మెగా వైద్య శిబిరానికి భారీగా స్పదన లభించిందని భద్రాద్రి జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి ఆదేశాల మేరకు ఏజెన్సీ ప్రాంతంలోని పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో ప్రతి సోమవారం డాక్టర్ ఎండీ మొహిద్దీన్ బృందం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు అందించడం జరుగుతుందని



గురిజాల గోపి తెలిపారు. ఈ సంధర్భంగా గోపి మాట్లాడుతూ.. నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా నాణ్యమైన ఉచిత వైద్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని పేద ప్రజలు ఈ ఉచిత మెగా వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు మహిళా సీనియర్ ఎండీ షబానా, కోరి శ్యామల, రెడ్డిబోయిన రేణుక, కన్నాపురం వసంత, దేరంగుల సుజాత, కన్నాపురం శైలజ, కుమారి, పార్టీ సీనియర్ నాయకులు ఎండి షరీఫ్, పింగళి మాధవరెడ్డి, యువజన నాయకులు గురజాల సందీప్, గురజాల సాయి, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొని సేవలు అందించారు.

# ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి.

## వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు- వరికుప్పల వెంకన్న పిలుపు

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఫిబ్రవరి 9 :

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తున్నది. మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం-2025, వీబీజి-రామ్ జీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్బీసీలో 100శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతించడం లాంటి ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 12న జరుప తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దత్తును తెలియజేస్తున్నాయి. రాష్ట్రంలోని కార్మికులు, ప్రజలు ఈ సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి, యాజమాన్యాలకు లాభం చేకూర్చేలా ప్రమాదకరమైన 4 లేబర్ కోడ్లను తెచ్చింది. వీటి వల్ల కార్మికులు ఈఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ పెన్షన్ వంటి సామాజిక భద్రతకు దూరమవుతారు. ఉద్యోగ భద్రత వుండదు. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో కార్మికుల పనిగంటలు పెంచుతూ చట్ట సవరణ జరిగింది. వీబీజి-రామ్ జీ చట్టం తెచ్చి కేంద్రం తన బాధ్యతల నుండి తప్పుకుంటున్నది. బడ్జెట్లో కేటాయింపులు తగ్గింపు, పని రోజులు తగిస్తోంది. విద్యుత్ సవరణ బిల్లు వల్ల సామాన్యులకు విద్యుత్ చార్జీలు పెరుగుతాయి. స్మార్ట్ మీటర్లు, క్రాస్ సబ్సిడీ రద్దుతో రైతులు, పేదలకిచ్చే ఉచిత మరియు సబ్సిడీ విద్యుత్ ప్రమాదంలో పడుతుంది. రాష్ట్రాల హక్కులను హరిస్తుంది. ఇది ఫెడరల్ స్పూర్తికి విరుద్ధం. విద్యుత్ ఛార్జీలు మరియు కీలక విషయాల నిర్ణయాల్లో రాష్ట్రాల అధికారాలు తగ్గించి తన పట్టును పెంచుకుంటుంది. విత్తన సవరణ బిల్లు వల్ల విత్తనాల ధరలను నియంత్రించే అధికారం ప్రయివేటు కంపెనీల చేతుల్లోకి వెళ్ళి, బహుళజాతి కంపెనీల పట్టు పెరుగుతుంది. దీంతో సాగు ఖర్చు భారీగా పెరుగుతుంది. ఎలసిలో 100శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించడం వల్ల విదేశీ కంపెనీలు కేవలం లాభాపేక్షతో పని చేస్తాయి. క్లెయిమ్ల విషయంలో సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయి. ప్రజల సొమ్మును మన దేశ అభివృద్ధికి కాకుండా విదేశీ కంపెనీల లాభాలకు మళ్ళిస్తారు.తమ డిమాండ్ల సాధనకోసం కార్మికులు, రైతు, వ్యవసాయ కార్మికు సంఘాలు మద్దతు ప్రకటించాయి. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ సార్వత్రిక సమ్మెకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వరికుప్పల వెంకన్న సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

# జగద్గిరిగుట్టలో హత్యాయత్నం కేసు --- ముగ్గురు అరెస్ట్



జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 09(భారత శక్తి):

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రూపు తగాదాలకు పాల్పడుతూ, జీడిమెట్ల పరిధికి చెందిన రౌడీషీటర్ ప్రశాంత్ రెడ్డి పై హత్యాయత్నానికి యత్నించి, మరికొందరిని చంపుతామని బెదిరించిన ముగ్గురు నిందితులను ఈరోజు జగద్గిరిగుట్ట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.జగద్గిరిగుట్ట ఇన్స్పెక్టర్ వెంకటేశం వివరాల ప్రకారం నిందితులు తరచూ గొడవలకు పాల్పడుతూ స్థానికంగా భయాందోళనలు సృష్టిస్తున్నట్లు వెల్లడైంది. అరెస్ట్ అయిన వారిలో ఏర్పుల సాయికుమార్ ఏ స్టోనర్ సాయి, వల్లపు సంపత్ కుమార్, మంజాల ఆదిత్య ఉన్నారు.నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్కు తరలించినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. శాంతిభద్రతలు పరిరక్షణలో భాగంగా ప్రత్యేకంగా రౌడీషీటర్లపై నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు.

# పిఆర్ టియు టీఎస్ సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో భారీ రక్తదాన శిబిరం

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఫిబ్రవరి 09: కామారెడ్డి జిల్లా పిఆర్ టియు భవన్లో రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో భారీ రక్తదాన శిబిరం నిర్వహించడమైనది.ఈ కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పిఆర్ టియు జిల్లా అధ్యక్షులు అల్లాపూర్ కుశాల్ అధ్యక్షత వహించారు. ఈ రక్తదాన శిబిరానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సుమారు 153 మంది ఉపాధ్యాయులు, పిఆర్ టియు నాయకులు రక్తదానం చేసి మానవతా విలువలకు ప్రతీకగా నిలిచారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, "పిఆర్ టియు సంఘం ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతూ అనేక విజయాలు సాధించడమే కాకుండా, సమాజానికి అవసరమైన ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం. రక్తదానం ద్వారా అనేక ప్రాణాలను కాపాడే అవకాశాన్ని కల్పిస్తున్న పిఆర్ టియు సేవాభావం ప్రశంసనీయం. గతంలో కూడా పిఆర్ టియు సంఘం వరద సహాయ నిధికి రూ.7 లక్షలు విరాళంగా అందించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను మరింత పెంపొందిస్తాయి'' అని తెలిపారు.జిల్లా విద్యాశాఖ అధికారి (డిఈఓ) రాజు మాట్లాడుతూ," పిఆర్ టియు సంఘం 50 ఏళ్ల చరిత్రలో భాగంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు, సమాజ సేవను కూడా లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతోందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టాలని" ఆకాంక్షించారు.రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న మాట్లాడుతూ,"పిఆర్ టియు సంఘం గత ఆరు సంవత్సరాలుగా నిరంతరంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ, రెండు సార్లు గవర్నర్ ప్రశంసలు అందుకోవడం గర్వకారణం. ప్రస్తుత పరిస్థితుల్లో రక్తదానం అత్యంత అవసరమైందని'' పేర్కొన్నారు.రక్తదాన శిబిరం అనంతరం, ఇటీవల మధ్యకాలంలో పదవీ విరమణ పొందిన పిఆర్ టియు సంఘం ఉపాధ్యాయులను, కామారెడ్డి జిల్లా పిఆర్ టియు శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు కుశాల్ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కుశాల్, ప్రధాన కార్యదర్శి పుట్ట శ్రీనివాస్ రెడ్డి, డిఈఓ రాజు, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు రాజన్న, రాష్ట్ర బాధ్యులు మధుసూదన్ రెడ్డి, రమేష్ రెడ్డి, జిల్లా నాయకులు, ఉపాధ్యాయులు, పిఆర్ టియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ప్రజలంతా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 09 (భారత శక్తి): ప్రజలంతా మున్సిపల్ ఎన్నికలలో స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం ఉదయం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి, ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో ఓటరు అవగాహన పెంపొందించుటకు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ఈ ర్యాలీని, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జెండా ఊపడం ద్వారా ప్రారంభించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత తెలిపేలా నినాదాలు చేస్తూ ఈ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో పలు పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ ముగిసిన అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన గొప్ప వరమని తెలిపారు. ఓటరుకు ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని వివరించారు. ఏ ఎన్నికలు వచ్చిన సంబంధిత ఓటర్లు అందరూ ఓటింగ్ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని అన్నారు. ఇటీవలి గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఓటర్లు పెద్ద ఎత్తున పాల్గొని స్పూర్తిని చాటారని వివరించారు. ఇదే విధంగా మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని, పట్టణాలలో ఓటింగ్ శాతాన్ని పెంచాలని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లందరూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందాల ద్వారా వార్డుల వారీగా ఓటు హక్కు పై విస్తృత అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలందరూ బ్యాంకింగ్ కేవైసీని ఎప్పటికప్పుడు పూర్తి చేసుకుంటూ ఉండాలని తెలిపారు. కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవడం వల్ల సైబర్ మోసాలకు గురికాకుండా సురక్షితంగా ఉండగలుగుతామని పేర్కొన్నారు. బ్యాంకింగ్ అధికారులు పెద్ద ఎత్తున కేవైసీ ప్రక్రియ పై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు.




ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, డీఈవో భోజన్న, ఎక్సైజ్ అధికారి ఎంఎ రజాక్, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్, గ్రామీణాభివృద్ధి శాఖ, బ్యాంకింగ్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ లో వీకెండ్-- స్పెషల్ డ్రంక్ & డ్రైవ్... 314 మందిపై కేసులు




సైబరాబాద్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 09:

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేశారు.ఈ డ్రైవ్లో భాగంగా మొత్తం 314 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. వీరిలో 245 ద్విచక్ర వాహనదారులు, 10 ఆటోలు, 58 కార్లు, 01 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి.బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే--- 272 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, 27 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, 15 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు.వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత --2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది.గత వారం (02.01.2026--07.01.2026)లో మొత్తం 266 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.వీరిలో 03 మందికి జరిమానా, జైలు శిక్ష, 19 మందికి జరిమానా, సోషల్ సర్వీస్, 244 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు

# ఆర్థిక భారం తో వైద్య పరీక్షలకు దూరం

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)ఫిబ్రవరి9:

పక్షవాతంతో మంచం పట్టిన ఇంటి యజమాని, అందరున్నా ఎవరు లేని అనాధ, ఆర్థిక భారంతో వైద్య పరీక్షలకు దూరం,పస్తులుంటూనే దేవునిపై భారం,ఆపన్నకోసం ఎదిరి చూస్తున్న కుటుంబం.పక్షవాతంతో మంచం పట్టిన అభాగ్యుని కుటుంబం పస్తుల పాలైంది. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబానికి పిడికెడు మెతుకులు పెట్టే ఇంటి యజమాని పక్షవాతంతో మంచం పెట్టాడు. వైద్య పరీక్షలు చేయించుకుందామంటే ఆర్థిక భారం వెంటాడుతుంది. ఈ అభాగ్యునికి అందరూ ఉన్న ఎవరూ లేని అనాధగా మిగిలిపోయిన హృదయ విదారక ఘటన వరంగల్ లోని ఉర్సులో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే.... వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలం ఉర్స్, ప్రతాపనగర్ ప్రాంతానికి చెందిన మాటేటి రాజేందర్ కూలి పనులు చేసన్తా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి భార్య మంజుల, కూతురు సాహితీ, కుమారుడు సాయి తేజలు ఉన్నారు. రాజేందర్ భార్య మంజుల భర్తకు చేదోడు వాదోడుగా బీడీల పనిచేస్తూ ఆర్థికంగా తోడుగా ఉంటుంది. అయితే రాజేందర్ కు గత కొన్ని సంవత్సరాలుగా మెడ నరాల నొప్పితో బాధపడుతున్నాడు. ఈ వ్యాధి చికిత్స స్థానిక ఎం.జీ.ఎం లో మందులు వాడుతూ వస్తున్నాడు. ఎంజీఎం ద్వారా తెచ్చుకున్న మందులపైనే ఆధారపడి చికిత్స పొందుతున్న క్రమంలో వ్యాధి నయం కాకపోగా పక్షవాతం బారిన పడ్డాడు. పక్షవాతం ఎడమ చేయి ఎడమ కాలుకు వచ్చింది. ఫలితంగా రాజేందర్ సొంత పనులు చేసుకునే పరిస్థితి లేకుండా ఉన్నాడు. దీంతో భార్య సహకారంతోనే రాజేందర్ సహపర్యాలు పొందుతున్నాడు.



రాజేందర్ మంచాన పడటంతో క్రమక్రమంగా భార్య మంజుల సైతం అనారోగ్యానికి గురైంది. దీంతో ఇల్లు గడవరం కష్టంగా మారింది. ఇంటి సమస్యలు ఉత్పన్నమవుతున్న క్రమంలో కుమారుడు సాయి తేజ కూడా ఎలాంటి పనులు చేయక పోవడం తో కుటుంబం గడవడం కష్టంగా మారింది.ఒకే కుటుంబంలో ముగ్గురు నిస్సహాయ స్థితిలో కూరుకుపోయారు. ఉన్న ఒక కుమార్తె ఏదైనా పని దొరికితే చేస్తాననీ ఎదురు చూస్తుంది. రాజేందర్ గత వారం రోజుల క్రితం హనుమకొండ బాలసముద్రంలోని ఒక ఆస్పత్రి వైద్యున్నీ కలిశాడు. వైద్య పరీక్షలు చేసిన వైద్యుడు పక్షవాతాన్ని నయం చేస్తానని నెలకు రూ 4000 చొప్పున మూడు నెలల్లో నయం చేస్తానని రూ 12000 ఖర్చులు అవుతాయని వైద్యుడు సూచించాడు. అయితే రాజేందర్ బంధువులు ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ అందరున్నా ఎవరు లేని అనాధగా మిగిలిపోయాడు. కేవలం రూ 12000 రూపాయలు ఇవ్వడానికి ఎవరు ముందుకు రావడం లేదనీ రాజేందర్ భార్య మంజుల తెలుపుతూ వాపోయింది. ఎవరైనా దాతలు ఉంటే ఆర్థిక సాయం అందిస్తారని అపన్న హస్త కోసం ఎదురుచూస్తున్న మాటేటి రాజేందర్.

ఫోన్ పే నెంబర్ 9390494294 (సాహితి,కూతురు)

మాటేటి రాజేందర్ అకౌంట్ నంబర్ 73099317013, ఐ.ఎఫ్.ఎస్.సీ. కోడ్

టీజీ ఆర్ బీ 0005154.తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రంగశాయిపేట, వరంగల్.

# సినిమా

## హైదరాబాద్ నుంచి ఓ భాగాన్ని తీసుకెళ్తున్న



టాలీవుడ్ సూపర్ స్టార్, ప్రిన్స్ మహేశ్ బాబు, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కలిసి నటిస్తున్న మూవీ 'వారణాసి'. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి. ఇందులో ప్రియాంక 'మందాకిని' అనే శక్తివంతమైన పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లలో పసుపు చీరలో పిస్టల్ పట్టుకుని ఉన్న లుక్ ఆకట్టుకుంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన హైదరాబాద్ షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది ఈ బాలీవుడ్ భామ. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది, షెడ్యూల్ ముగియడంతో లాస్ ఏంజిల్స్‌కు బయల్దేరిన ప్రియాంక, ఫ్లైట్‌లో ప్రయాణిస్తూ ఇక్కడి ఫేమస్ 'బన్ మస్కా' చిత్రాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ లో పంచుకుంది. 'హైదరాబాద్ నుంచి ఓ భాగాన్ని నాతో తీసుకెళుతున్న. త్వరలో కలుద్దాం. నేను నటించిన హాలీవుడ్ యాక్షన్ థ్రిల్లర్ 'ది బ్లఫ్' ప్రమోషన్స్ కోసం లాస్ ఏంజిల్స్ వెళ్తున్న. ఆ ప్రచార కార్యక్రమాలు ముగిసిన వెంటనే తిరిగి 'వారణాసి' సెట్స్‌లో జాయిన్ అవుతా' అని పోస్ట్ చేసింది. కాగా చాలా కాలం తర్వాత ప్రియాంక భారతీయ సినిమాలో నటిస్తున్న చిత్రం ఇదే కావడం విశేషం.




## కూతురు కోసం

యాక్షన్ కింగ్ అర్జున్ తన దర్శకత్వ ప్రతిభతో మరోసారి మ్యాజిక్ చేయడానికి సిద్ధమయ్యాడు. సుదీర్ఘ విరామం తర్వాత ఆయన దర్శకత్వం వహించిన సీతాపయనం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తన కుమార్తె ఐశ్వర్య అర్జున్ కెరీర్ కోసం తండ్రిగా ఆయన పడిన తపన, ఈ కథకు మెగాస్టార్ చిరంజీవి అందించిన ప్రోత్సాహం సినిమాపై అంచనాలను పెంచేస్తున్నాయి. వాలెంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 14న ఇది రిలీజ్ కానుంది. ఈ సినిమా కథ మొత్తం మెగాస్టార్‌కు క్షుణ్ణంగా తెలుసట. కథలో ఉన్న బలం చూసి, ఇష్టపడి అందులో ఒక కీలకమైన పాత్ర కోసం ఒక అద్భుతమైన నటుడిని ఎంపిక చేయుమని ప్రత్యేకంగా సూచించాడట. ఆయన సలహాతో ముందుగా సేతుపతిని సంప్రదించగా డేట్స్ సర్దుబాటు కాక ఆయన ఈ ప్రాజెక్టులో భాగం కాలేదట. దీంతో కొన్ని మార్పులు చేసి తన కుమార్తె కోసం తానే ఆ రోల్ ప్లే చేయాలని నిర్ణయించుకున్నట్లు అర్జున్ వెల్లడించాడు.

## పెర్ఫెక్ట్ లుక్

కుర్రకారు క్రష్ గా మారిపోయిన భాగ్యశ్రీ బోర్సే ఈ మధ్యకాలంలో వరుస ప్రాజెక్టులలో బిజీగా ఉంటూనే తన అందాలతో ఎప్పటికప్పుడు లైమ్ లైట్ లో నిలుస్తోంది. మోడల్‌గా కెరీర్ మొదలుపెట్టి తర్వాత సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. యారియన్ 2 చిత్రం ద్వారా బాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ భామ.. మిస్టర్ బచ్చన్ సినిమాతో పూర్తిస్థాయి హీరోయిన్‌గా అవతరించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తన అభిమానులను ఆకట్టుకునేందుకు ఈ భామ క్రీమ్ అండ్ లైట్ మెరూన్ కాంబినేషన్‌లో ఒక లాంగ్ ఫ్రాక్ ధరించి మెరిసింది. చెట్ల చాటున చాలా అందంగా ఫొటోలకు ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఆమె షేర్‌చేసిన ఫొటోలు కుర్రకారుతో పాటు సినీప్రియులను ఆకట్టుకుంటున్నాయి. వాటిని చూసిన అభిమానులు ఫైర్, హార్ట్, లవ్‌ఎమోజీలను షేర్ చేస్తూ తమ మనసు దోచేశావు అంటూ మీమ్స్ కూడా షేర్‌చేస్తున్నారు. ప్రస్తుతం ఈ భామ అఖిల్ అక్కినేని హీరోగా నటిస్తున్న లెనిన్ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది.



## పిల్లలకు సోషల్ మీడియా నిషేధించాలనే డిమాండ్ పై
## ఆర్జీవీ ఆసక్తికర వ్యాఖ్యలు



సోషల్ మీడియా ఇప్పుడు జనాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇది లేకుండా జనాలు కొంత సమయం కూడా గడిపే పరిస్థితి కనిపించడం లేదు. చిన్న పిల్లలు సైతం దీనికి బానిసలు కావడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో పిల్లలకు సోషల్ మీడియా అందుబాటులో లేకుండా పలు దేశాలు నిషేధం విధించే దిశగా వెళుతున్నాయి. 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాను దూరం చేయాలనే డిమాండ్ ఇండియాలో కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా అంటే కేవలం కాలక్షేపం కాదని, అది జ్ఞాన భాండాగారమని ఆర్జీవీ అన్నారు. ఇతర దేశాల్లో పిల్లలు రెడ్డిట్, యూట్యూబ్ వంటి ప్లాట్ ఫామ్స్ ద్వారా కోడింగ్, సైన్స్ నేర్చుకుంటూ అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడుతున్నారని... మనం ఇక్కడ సోషల్ మీడియాపై నిషేధం విధిస్తే... మన పిల్లలు పోటీలో వెనుకబడిపోతారని చెప్పారు. మన పిల్లల జీవితాన్ని మనమే నాశనం చేసిన వాళ్లమవుతామని అన్నారు. కొందరు చేసే తప్పులకు మొత్తం టెక్నాలజీని నిషేధించడం సరికాదని చెప్పారు. రక్షణ పేరుతో పిల్లలకు ఇన్ఫర్మేషన్ అందకుండా ఆపేస్తే... వారి జీవితం అంధకారం అవుతుందని అన్నారు. కెరీర్ బాగుండాలంటే డిజిటల్ ప్రపంచంపై పట్టు ఉండాలని చెప్పారు.

## విజయ్ దేవరకొండ పెళ్లిపై మీడియా ప్రశ్న...
## స్పందించిన దర్శకుడు తరుణ్ భాస్కర్



సినీ నటుడు విజయ్ దేవరకొండ పెళ్లికి తనకు ఆహ్వానం అందలేదని ప్రముఖ దర్శకుడు, నటుడు తరుణ్ భాస్కర్ వెల్లడించారు. తన కొత్త సినిమా 'గాయపడ్డ సింహం' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆయన సందడి చేశారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు విజయ్ దేవరకొండ పెళ్లి అంశాన్ని ప్రస్తావించారు. ఈ నెల 26న విజయ్, రష్మికలు వివాహం చేసుకోబోతున్నారంటూ ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారం నేపథ్యంలో, త్వరలో విజయ్ దేవరకొండ వివాహమని తెలిసింది, మీరు వెళుతున్నారా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. తనకు ఆహ్వానం అందలేదని, ఒకవేళ ఆహ్వానిస్తే మీకు కూడా వాట్సాప్‌లో పంపిస్తానని, అప్పుడు కలిసి వెళదామని తరుణ్ భాస్కర్ సమాధానమిచ్చారు. విజయ్, తరుణ్ భాస్కర్ మంచి స్నేహితులు. తరుణ్ దర్శకత్వంలో, విజయ్ హీరోగా 2016లో వచ్చిన 'పెళ్లిచూపులు' చిత్రం ఘన విజయం సాధించింది.

## అమ్మకు మళ్లీ పెళ్లి చేయాలి
## : సురేఖ వాణి కూతురు సుప్రీత



తన తల్లి సురేఖకు మళ్లీ పెళ్లి చేయాలనే ఆలోచన తనకు ఉందని సుప్రీత తెలిపింది. ఇదే విషయాన్ని ఇటీవల అమ్మతో చెప్పానని... కానీ ఆమె మాత్రం తన తండ్రి జ్ఞాపకాలతోనే జీవించాలనుకుంటోందని చెప్పింది. తన తండ్రి స్థానంలోకి మరెవరినీ రానివ్వాలనుకోవడం లేదని తెలిపింది. అయితే, తాను పెళ్లి చేసుకునే లోపల... తన తల్లికి మంచి జీవిత భాగస్వామి దొరికితే బాగుంటుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. అమ్మ మరో పెళ్లి చేసుకోవడానికి తమ కుటుంబ సభ్యులు కూడా ఒప్పుకున్నారని తెలిపారు.

## పెద్ది' సెకండ్ సింగిల్‌కు ముహూర్తం.. ప్రేమికుల రోజున చరణ్ మాస్ ట్రీట్!

మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది'పై అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామా నుంచి రాబోయే ప్రతి అప్‌డేట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన తొలి పాట 'చికిరి చికిరి' సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. ఇప్పుడు ఈ చిత్రం నుంచి రెండో పాట విడుదలకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఫిలింనగర్ వర్గాల సమాచారం ప్రకారం 'పెద్ది' రెండో పాటను ప్రేమికుల దినోత్సవం (వాలంటైన్స్ డే) సందర్భంగా ఈ నెల 14న విడుదల చేయాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. ఈ పాట రామ్‌చరణ్



క్యారెక్టర్‌ను పరిచయం చేసే పవర్‌ఫుల్ ఇంట్రడక్షన్ సాంగ్‌గా ఉండబోతోందని సమాచారం. చరణ్ మాస్ ఎనర్జీని, పాత్ర స్వభావాన్ని గ్రాండ్‌గా ఎలివేట్ చేసేలా ఈ గీతాన్ని సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరపరిచినట్లు తెలుస్తోంది. ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ ఈ పాటకు నృత్యాలు సమకూర్చడం అంచనాలను మరింత పెంచుతోంది. ఈ పాటలో చరణ్ డాన్స్ మూమెంట్స్ అభిమానులకు కనుల పండుగ చేయనున్నాయని టాక్ వినిపిస్తోంది. వాస్తవానికి ఈ పాటను సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని భావించినప్పటికీ, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. ఇప్పుడు వాలంటైన్స్ డేకి రిలీజ్ చేయాలనే నిర్ణయం సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సైతం ఈ పాట అభిమానులకు ఒక బ్లాస్ట్‌లా ఉంటుందని సంకేతాలు ఇచ్చారు. 'ఆర్ఆర్ఆర్' తర్వాత రామ్‌చరణ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో 'పెద్ది'పై దేశవ్యాప్తంగా భారీ క్రేజ్ నెలకొంది. ఇప్పటికే విడుదలైన 'చికిరి చికిరి' పాట ఒక్క తెలుగులోనే 150 మిలియన్లకు పైగా, అన్ని భాషల్లో కలిపి 200 మిలియన్లకు పైగా వ్యూస్‌తో యూట్యూబ్‌లో సెన్సేషన్ క్రియేట్ చేసింది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, జగపతిబాబు, శివ రాజ్‌కుమార్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# అందిన కాడికి దోచుకుంటున్న సూర్యాపేటలో కొన్ని మేనేజ్మెంట్ ప్రైవేట్ ఆసుపత్రులు

- సమస్య చిన్నదైనా అన్ని పరీక్షలు చేయిస్తున్న వైనం
- సిండికేట్ గా మారి వేళల్లో లక్షల్లో రోగుల వద్ద దోచుకుంటున్నారు...?
- అడిగే నాథుడు లేడు...అడ్డు అదుపు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న పేట లో కొన్ని మేనేజ్మెంట్ ప్రైవేటు ఆసుపత్రులు
- లింగ నిర్ధారణ పరీక్షలు చేసి వీలైతే అబార్షన్లు కూడా చేస్తున్న ఓ ప్రైవేటు ఆసుపత్రి




**ప్రత్యేక కథనం సీనియర్ జర్నలిస్టు (భారత శక్తి, సూర్యాపేట జిల్లా ప్రతినిధి) (కందుకూరి యాదగిరి)**

సూర్యాపేటలో కొన్ని మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రైవేటు ఆసుపత్రులు రోగుల వద్ద అందిన కాడికి దోసుకుంటున్నారు.చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు సైతం అన్ని రకాల వైద్య పరీక్షలు వీలైతే స్కానింగ్లు తీయించే పరిస్థితికి తీసుకొస్తున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మేనేజ్మెంట్ ఆసుపత్రికి వస్తే తక్కువలో తక్కువ 50 వేల నుండి లక్ష రూపాయల వరకు వదిలించుకొని వెళ్లే పరిస్థితి కల్పిస్తున్నారని రోగులు తమ బాధను వ్యక్తపరుస్తున్నారు. ఆరోగ్య ఇబ్బందులతో ఆసుపత్రులకు వస్తే సమస్య పోతుందో లేదో తెలియక ముందే ఆర్థిక సమస్య నెత్తిన వచ్చి కూర్చుంటుందని తిరిగి ఆర్థిక ఇబ్బందులు గురి కావాల్సి వస్తుందని ఇదో రకమైన మానసిక వేదన కలుగుతుందని వాపోతున్నారు.అడిగినంత ఫీజు ఇచ్చేవరకు ముక్కు పిండి వసూలు చేస్తున్నారని తీరా ఆసుపత్రి నుండి డిశ్చార్జి అయ్యే సమయంలో... వేళల్లో మందుల లిస్టు ముందు పెడుతున్నారని అది కూడా తమ ఆసుపత్రులలో ఉన్న మందుల దుకాణంలోనే కొనుగోలు చేయాలని బయట ఎక్కడ దొరకవని మా డాక్టర్ రాసిన మందులు వాడితేనే మీ సమస్య నయం అవుతుందని బెదిరింపులకు గురి చేస్తున్నారని రోగులు తమ గోడును వెల్లబోసుకుంటున్నారు.

తాజాగా సూర్యాపేట మండలం ఓ గ్రామ పంచాయతీ కి చెందిన ఓ వ్యక్తి భారత శక్తి సూర్యాపేట జిల్లా ప్రతినిధి సీనియర్ జర్నలిస్టు కందుకూరి యాదగిరి కి తమ సమస్యను చెప్పుకున్నారు.మా పాపకు బాగోలేకపోతే తమకు తెలిసిన ఆర్ఎంపి ఇచ్చిన అడ్రస్ మేరకు సూర్యాపేటలో పేరుగాంచిన చిన్నపిల్లల ఆసుపత్రికి తీసుకువెళ్తే లక్ష రూపాయలకు పైగా అవుతాయని పాపను చూడగానే చెప్పడంతో తమ గుండెల్లో బండరాయి వేసినట్లుగా అయిందని అంత ఆర్థిక స్తోమత లేని తాము సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి ఒక్కరోజులోనే నయం చేయించుకొని నయా పైసా ఖర్చు లేకుండా తిరిగి క్షేమంగా తమ పాపను ఇంటికి తీసుకువెళ్లామని చెప్పారు. దీన్నిబట్టి ఆలోచిస్తే మనకు అవగతం అవుతుంది సూర్యాపేటలో కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు ఎంత దోపకానికి పాల్పడుతున్నాయో...!ఇంతే కాకుండా తిరుమలగిరి మండలానికి చెందిన ఓ గ్రామపంచాయతీ నుండి తాజాగా గర్భంతో ఉన్న ఓ మహిళ తనకు ఉన్న సమస్యలను బట్టి అబార్షన్ చేయించుకోవడానికి అని సూర్యాపేటలోని విద్యానగర్లో ఓ ప్రైవేటు ఆసుపత్రిని సంప్రదిస్తే ముందుగా 1 లక్ష రూపాయలు డిమాండ్ చేశారు. ఆ తరువాత 85000 ఇవ్వమన్నారు. చివరికి 65 వేల తో బేరం కుదుర్చుకొని పని కానిచ్చారని తెలిసింది.ఇలా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తూ, అక్రమాలకు పాల్పడుతూ, మేనేజ్మెంట్ ఆసుపత్రులు అదే విధంగా మరికొన్ని ప్రైవేటు ఆసుపత్రులు సూర్యాపేటలో ఇష్టానుసారంగా కొనసాగుతున్నాయి.వీళ్ళ ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. అడిగే వారు లేరు! ప్రశ్నించేవారు లేరు!! తనిఖీలు చేసేవారు అంతకన్నా లేరు!

*** ఇంత దోపకం ఎలా జరుగుతుంది?**

అని సామాన్యుడికి ప్రశ్న ఎదురైతే సమాధానం ఒక్కటే...!స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు,సంబంధిత శాఖ అధికారుల సహకారం, పెద్ద డాక్టర్ల సపోర్టు,కుల సంఘాలు,మత సంఘాలు,ఇలాంటి వారికి కొమ్ముకాస్తున్న పలు రాజకీయ పార్టీల నాయకులు,కొంతమంది మీడియా వారి ప్రోత్సాహం ప్రోద్బలం ఉండబట్టి అక్రమాలు సాగుతున్నాయని ప్రజలు చెప్పుకుంటున్నారు. ఇలా అక్రమాలు చేసి సొమ్ము చేసుకుంటున్న వారి వద్ద నుండి తమ వంతుగా ఆమ్యామ్యాలు పుచ్చుకొని ఇలాంటి పెద్దలందరూ అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారని ప్రజలు గుసగుస లాడుకుంటున్నారు.ఇలాంటి అక్రమాలకు పైన లిస్టులో ఉన్న ప్రబుద్ధులు అందరూ సహకరిస్తేనే ఇంత జరగటానికి అవకాశం ఉంటుందని ప్రజలు మాట్లాడుకుంటున్నారు.

*** వ్యవస్థ ఇంత దారుణంగా తయారైతే ప్రజలకు న్యాయం చేసేది ఎవరు?**

ఇంతే కాకుండా అనుభవం లేని సిబ్బంది తో రోగులు మరికొంత ఇబ్బంది పడాల్సిన పరిస్థితి దాపురించింది.

సంబంధిత ఆసుపత్రులలో ఎటువంటి అనుభవం లేని వారు రోగులతో చెలగాటం ఆడుతారు. అమర్యాదగా మాట్లాడతారు.గుంపులు గుంపులుగా కనిపిస్తారు.ఆస్పత్రుల్లో పనిచేసేవారు చక్కగా దుస్తులు ధరించి పద్ధతిగా ఉండకుండా చిచోరా చేష్టలు చేసేవారిలా తాగుబోతు బ్యాచిలగ కనబడతారు.ఏ ఒక్కరికి ఆసుపత్రిలో పనిచేసే సిబ్బందికి ఉండవలసిన లక్షణాలు కనిపించనే కనిపించవు.ప్రజా ప్రతినిధులు అధికారులు ఇకనైనా స్పందించి ఎప్పటికప్పుడు ఆసుపత్రులు తనిఖీలు చేసి ఇలాంటి ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

*** ఈ విషయమై జిల్లా వైద్యాధికారి***

ఈ విషయమై జిల్లా వైద్యాధికారితో చరవాణిలో సంప్రదించగా అలాంటివి తన దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు చేపడుతాము అని తెలిపారు. అదేవిధంగా త్వరలోనే అన్ని ఆసుపత్రులను తనిఖీ చేస్తామని ముఖ్యంగా అబార్షన్లు చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారం

**: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 09 (భారతశక్తి): జిల్లాలో ఈ నెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికల పోలింగ్ లో భాగంగా ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం 5.00 గంటలతో ముగిసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్‌కు ముందు 48 గంటల నిశ్శబ్ద వ్యవధి (సైలెన్స్ పీరియడ్) అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ మున్సిపాలిటీల చట్టం, 2019లోని సెక్షన్ 209 ప్రకారం, నిశ్శబ్ద వ్యవధి సమయంలో ఎవరూ కూడా ఎన్నికలతో సంబంధం ఉన్న ఎలాంటి బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ప్రజలను ఉద్దేశించి ఎన్నికల ప్రచార ప్రసంగాలు చేయడం, సినిమా, టెలివిజన్, ఇతర ఎలక్ట్రానిక్ మాధ్యమాలు, మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా ద్వారా ఎన్నికల ప్రచారం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. అలాగే రాజకీయపరమైన ఎస్ఎంఎస్‌లు, బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపడం లేదా ఇతర వినోద కార్యక్రమాల ద్వారా ప్రజలను ఆకర్షిస్తూ ఎన్నికల ప్రచారం చేయడం చట్టవిరుద్ధమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. నిశ్శబ్ద వ్యవధి సమయంలో సోషల్ మీడియాలో ప్రసారం అయ్యే సందేశాలను నిశితంగా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. నిశ్శబ్ద వ్యవధి నిబంధనలను ఉల్లంఘిస్తే సంబంధిత వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం జారీ చేసిన సూచనలు, ఆదేశాలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, ఎంసీసీ బృందాలు, పోలీస్ అధికారులు పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, కళ్యాణ మండపాలు, హోటళ్లు, లాడ్జింగ్ కేంద్రాల్లో విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఒపీనియన్ పోల్స్, ఎగ్జిట్ పోల్స్ నిర్వహణ పూర్తిగా నిషేధమని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల నిబంధనలను పాటిస్తూ పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కోరారు.

## గ్రామ పంచాయతీ స్థాయి నుండి
# మునిసిపాలిటీని చేసిన ఘనత కేసీఆర్ దే

- * ములుగులో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి సహకరించండి.
- * బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకుల మర్రి లక్ష్మణ్ బాబు.



ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 09 (భారత శక్తి): ములుగు ను గ్రామపంచాయతీ స్థాయి నుండి మునిసిపాలిటీ స్థాయికి తీసుకెళ్లిన ఘనత కేసిఆర్ కే దక్కుతుందని, టిఆర్ఎస్ పార్టీ కి చెందిన అభ్యర్థులను గెలిపించి ములుగు అభివృద్ధికి సహకరించాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మణరావు అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ ములుగు మున్సిపాలిటీలో గతంలో జరిగిన అవినీతి ని కొత్తవారైతే వెలికి తీస్తారని పాత వారికే టికెట్ ఇచ్చారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ఈ ప్రాంత ం లో ఎన్కౌంటర్లు, వరద ప్రభావంతో మునగడాలు జరిగితే మాత్రమే ములుగు పేరు వినాల్సి వచ్చేది కానీ నేడు కేసీఆర్ ములుగును మున్సిపాలిటీగా చేసి అభివృద్ధిలో ముందు ఉంచారన్నారు. రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో మురుగు కాలువల పరిస్థితి దారుణమని, పేదవారికి ఇండ్లు మంజూరు చేయలేదని, జిల్లాలో 50వేల ఇండ్లకు పట్టాలు ఇచ్చిన ఘనత కేసిఆర్ ది అన్నారు. పేద మధ్యతరగతి ప్రజల పరిస్థితి దుర్భరమని కనీసం చిరు వ్యాపారులకు సైతం ఇల్లు కట్టించలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి అభివృద్ధి చేసిందో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, రైతు భీమా వంటి పథకాలు అమలు చేసి రైతులను ఆదుకున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ం పెండింగ్లో పెట్టిన పథకాలైన మహిళలకు పెన్షన్ల వంటి బాకీ కార్డు ప్రజల్లోకి తీసుకెళ్లా మన్నారు. ములుగులో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మెడికల్ కాలేజీ తెచ్చామని , ఏటూరు నాగారం గ్రామపంచాయతీ ఎలక్షన్లో దొరలు పోటీలో ఉన్నారని ప్రచారం చేసిన మంత్రి సీతక్క ములుగులో కూడా అదే రీతిలో మున్సిపల్ కౌన్సిలర్ల ను ప్రస్తుత ప్రభుత్వం నియమించారని, దొరలు దొరసానులని మంత్రి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. ములుగు అభివృద్ధికి కృషి చేసింది బిఆర్ఎస్ అన్నారు. ములుగు మున్సిపాలిటీ పోరు కాంగ్రెస్ నాయకులకు వర్సెస్ ములుగు ప్రజలకు అన్నట్లుగా ఉందన్నారు. ములుగు జిల్లాను రద్దు చేసే ఉద్దేశంలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఉందని జిల్లా అలాగే కొనసాగాలంటే మున్సిపాలిటీ లో కారు గుర్తుకు ఓటు వేసి గులాబీ జెండా ఎగరేయాలి అన్నారు. ములుగు ప్రజలు అధిక సంఖ్యలో బిఆర్ఎస్ కు మున్సిపల్ కౌన్సిలర్ల సీట్లు ఇచ్చి ఆదరించాలని ములుగు ప్రజలను వేడుకొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి, మాజీ జెడ్పిటిసి లు సకినాల భవాని, గై రుద్రమదేవి, సీనియర్ నాయకులు గోవింద నాయక్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రమేష్ రెడ్డి, ములుగు పట్టణ అధ్యక్షులు చెన్న విజయ్, కోకిల మహేష్ , నాయకులు శీలం మధు , బై కానీ ఓదెలు (బుల్లెట్) తదితర నాయకులు పాల్గొన్నారు.



## ఆదిలాబాద్‌లో ఘనంగా
# PRTU TS ఆవిర్భావ దినోత్సవం

ఆదిలాబాద్ జిల్లా , ఫిబ్రవరి 09 (భారత శక్తి): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో PRTU TS (ప్రోగ్రెసివ్ రెకగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ - తెలంగాణ రాష్ట్రం) ఆవిర్భావ దినోత్సవాన్ని సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కొమ్ము కృష్ణ కుమార్ సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, పాఠశాలల పరిరక్షణే సంఘ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సంఘ నిర్మాణం బలంగా ఉన్నప్పుడే ఉపాధ్యాయుల సమస్యలు సమర్థవంతంగా పరిష్కరించబడతాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం, విద్యా వ్యవస్థ అభివృద్ధి కోసం PRTU TS నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన అన్నారు. PRTU TS ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వృద్ధాశ్రమంలో భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టి. నరసింహ స్వామి, గౌరవాధ్యక్షులు గోవర్ధన్, రాష్ట్ర బాధ్యులు, జిల్లా బాధ్యులు, మండల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌తో వీడియో కాన్ఫరెన్స్ కు హాజరైన
# జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 09 (భారత శక్తి): మున్సిపల్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మరియు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, పోలింగ్ రోజు చేపట్టాల్సిన ఏర్పాట్లు, ఎన్నికల నియమావళి అమలు, శాంతి భద్రతల పరిరక్షణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి జానకి షర్మిల మాట్లాడుతూ...ఎన్నికల పోలింగ్ మొదలుకొని కౌంటింగ్ వరకు పోలీసు శాఖ తరపున పూర్తి ఏర్పాట్లు, చేశామన్నారు. పోలీసు బందోబస్తు,పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత తదితర అంశాలపై జిల్లా ఎస్పీ డా.జి జానకి షర్మిల ఐపీఎస్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినికి కూలంకుషంగా వివరించారు. మున్సిపల్ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ డా. జి జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు.

# హోంగార్డు కుటుంబానికి చేయూత.. రూ. 34 లక్షల బీమా అందజేత

హైదరాబాద్, ఫిబ్రవరి 09 (భారత శక్తి): విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి అండగా నిలుస్తూ పోలీస్ శాఖ, యాక్సిస్ బ్యాంక్ సంయుక్తంగా బీమా పరిహారాన్ని అందజేశాయి. రాచకొండ కమిషనరేట్ పరిధిలో హోం గార్డుగా విధులు నిర్వహించిన ఎం. వెంకటేష్ గత ఏడాది ఏప్రిల్ 27న జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. హోంగార్డు విభాగంతో యాక్సిస్ బ్యాంక్ కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం, వేతనం అకౌంట్ కలిగిన సిబ్బందికి వర్తించే ప్రమాద బీమా సౌకర్యం కింద రూ. 34 లక్షల పరిహారం మంజూరైంది. అడిషనల్ డీజీపీ (హోంగార్డు) స్వాతి లక్రా చేతుల మీదుగా ఈ చెక్కును మృతుడి భార్య కొడిగంటి స్వాతికి డీజీపీ కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా స్వాతి లక్రా మాట్లాడుతూ..మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి పోలీసు శాఖ తరపున ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. విపత్కర సమయంలో బాధిత కుటుంబానికి సకాలంలో ఆర్థిక సాయం అందించిన యాక్సిస్ బ్యాంక్ యాజమాన్యాన్ని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో యాక్సిస్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, బ్యాంక్ ప్రతినిధులు, హోంగార్డు రీజియన్ కమాండెంట్ వెంకటేశ్వర్లు, ఏవో సాయి కుమార్ పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో 'సనాతన బోర్డు' ఏర్పాటు చేయాలి

* **ఆధ్యాత్మిక వేత్తలు, హిందూ సంఘాల డిమాండ్**
* **శ్రీశైలంలో దర్గా తొలగింపుపై హర్షం.. 'ఛలో శ్రీశైలం' వాయిదా***
* **తిరుమల లడ్డూ కల్తీపై సిట్ విచారణలో దిగ్భ్రాంతికర నిజాలు**



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (భారత శక్తి): హిందూ దేవాలయాల పరిరక్షణకు, సనాతన ధర్మ రక్షణకు జాతీయ స్థాయిలో 'సనాతన బోర్డు'ను తక్షణమే ఏర్పాటు చేయాలని పలువురు ఆధ్యాత్మిక వేత్తలు, హిందూ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎన్ఎస్ఎస్‌లో తెలంగాణ సాధు పరిషత్, సనాతన ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దేవాలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా పాలకులు కఠిన చర్యలు తీసుకోవాలని, గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలని వారు ముక్తకంఠంతో కోరారు. అన్యామత వ్యాపారాలకు తావులేదు.. ఆలయాల పరిసరాల్లో అన్యామత కార్యక్రమాలు, బోర్డులను వెంటనే తొలగించాలని సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ స్వామీజీ స్పష్టం చేశారు. పుణ్యక్షేత్రాల్లో అన్యమతస్తుల వ్యాపారాలను, దేవాలయ పాలక మండళ్లలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న అన్యమతస్తులను కూడా తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీశైలం పాతాళ గంగలో అక్రమంగా నిర్మించిన దర్గాను ఏపీ ప్రభుత్వం స్పందించి తొలగించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 14న పిలుపునిచ్చిన 'ఛలో శ్రీశైలం' కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై విచారణ వేగవంతం చేయాలి. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో ఆవు నెయ్యికి బదులు రసాయనాలు వాడారని 'సిట్' దర్యాప్తులో తేలడం అత్యంత విచారకరమని సనాతన ధర్మ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కుట్ర వెనుక ఉన్న టీటీడీ బోర్డు మాజీ సభ్యులు, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును డిమాండ్ చేశారు. హిందూ సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దాడులను అరికట్టాలని, ఆలయాలపై దాడులు చేసే వారిని పిచ్చివారిగా పేర్కొని తప్పించుకోవడం సరికాదని వారు అభిప్రాయపడ్డారు.

*** సనాతన బోర్డుతోనే పరిష్కారం:**

హిందూ దేవాలయాల నిర్వహణ భక్తుల చేతుల్లోనే ఉండాలని, ఇందుకోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాధు పరిషత్ ఉపాధ్యక్షుడు విశ్వాత్మానంద, రఘోత్తమ చార్య, నాయకులు నాగేశ్వరచారి, కె. కిరణ్, మహేష్, రవికిరణ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.








## విద్యార్థులకు జ్ఞాన నైపుణ్యం పెంపించే విధంగా కృషి చేయాలి

* **ఉపాధ్యాయులు విద్యావేత్త శ్రీభవిష్య మాంటిసరి చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వెల్లడి**

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (భారత శక్తి): ఎల్బీనగర్ నియోజకవర్గం బి.యన్.రెడ్డి. నాగార్జున కాలనీ హస్తినాపురం లోని శ్రీ భవిష్య మాంటిసరి పాఠశాలలో బ్రెయిన్ ఫెస్ట్ (ప్రాజెక్టు ద్వారా జ్ఞానం నైపుణ్యం సంపాదించే ) కార్యక్రమం చైర్మన్ టి .శ్రీనివాస్ రెడ్డి ఘనంగా ప్రారంభోత్సవం చేశారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ముందు తమ ప్రతిభను చూపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయుని బృందం పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో కాంగ్రెస్ 'హస్తం' గర్జన!

* **లావణ్య శ్రీధర్ గౌడ్ గెలుపు ఖాయం: ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**
* **ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారం.. ఓటర్లకు ప్రముఖుల విజ్ఞప్తి**

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 9 (భారత శక్తి): యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో రాజకీయ సందడి పతాక స్థాయికి చేరింది. మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ఉన్న తెలివెల్ల లావణ్య శ్రీధర్ గౌడ్ గెలుపు ఖాయమని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో భాగంగా చివరి రోజున నిర్వహించిన భారీ ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

**సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తోందని బీర్ల ఐలయ్య కొనియాడారు. "రాష్ట్రంలో అమలవుతున్న ప్రజారంజక పాలనే మన అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపిస్తుంది. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. లావణ్య శ్రీధర్ గౌడ్ విజయాన్ని సోనియమ్మకు కానుకగా



ఇవ్వాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

**ప్రచారంలో సినీ మెరుపులు**

ఈ ప్రచార కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు సుమన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయనతో పాటు పంజాల జైహింద్ గౌడ్, వేముల, కొండల్ గౌడ్, మరియు పంజాల లోకేష్ గౌడ్ తదితర ప్రముఖులు పాల్గొని కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఓటు వేయాలని అభ్యర్థించారు.

కొండల్ గౌడ్ వ్యాఖ్యలు: మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే స్థానిక సమస్యలపై అవగాహన ఉన్న లావణ్య గారిని గెలిపించాలి. ఇది యాదగిరిగుట్ట రాజకీయాల్లో ఒక కీలక మలుపు కాబోతోంది.

జైహింద్ గౌడ్ పిలుపు: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది, మున్సిపాలిటీలో కూడా మన పార్టీకి పట్టం కడితేనే నిధుల ప్రవాహం పెరిగి స్థానిక సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయి.

**11న 'చేతి' గుర్తుకే ఓటు వేయండి**

ఎన్నికల ప్రచార గడువు ముగియడంతో నాయకులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఈ నెల 11వ తేదీన జరిగే పోలింగ్‌లో ఓటర్లందరూ తమ అమూల్యమైన ఓటును *'చేతి గుర్తు'*పై వేసి, లావణ్య శ్రీధర్ గౌడ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.




# ఎల్.బి.నగర్ అభివృద్ధికి బాటలు

* **నేడు మంత్రి శ్రీధర్ బాబు పర్యటన**
* **రూ. 45 కోట్ల పనులకు శంకుస్థాపన చేయనున్న జిల్లా ఇన్చార్జి మంత్రి**
* **నాగోల్ నుంచి భారీ ర్యాలీగా వెళ్లేందుకు శ్రేణుల సన్నద్ధం**

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 9 (భారత శక్తి): నియోజకవర్గ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీ దుద్దిల్ల శ్రీధర్ బాబు మంగళవారం (ఫిబ్రవరి 10) ఎల్.బి.నగర్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సుమారు రూ. 45 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన ఈ సందర్భంగా శంకుస్థాపన చేయనున్నారు.

**ముఖ్య కార్యక్రమాల వివరాలు:**

* మంత్రి పర్యటన మధ్యాహ్నం 2:00 గంటలకు ప్రారంభం కానుంది. షెడ్యూల్ ప్రకారం ప్రధాన కార్యక్రమాలు ఇలా ఉన్నాయి.
* లింగోజిగూడ డివిజన్: ప్రియదర్శిని పార్క్ వద్ద రూ. 11.93 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బ్రిడ్జి, పైప్‌లైన్ పనులకు మధ్యాహ్నం 2:00 గంటలకు శంకుస్థాపన చేస్తారు.
* హస్తినాపురం డివిజన్: జడ్పీ రోడ్, దేవకమ్మ తోట వద్ద రూ. 5.95 కోట్ల వ్యయంతో చేపట్టే ఎల్.బి.నగర్ సర్కిల్ కార్యాలయ భవన నిర్మాణంతో పాటు, సుమారు రూ. 15 కోట్ల విలువైన ఇతర అభివృద్ధి పనులకు మధ్యాహ్నం 2:30 గంటలకు భూమిపూజ నిర్వహిస్తారు.
* వనస్థలిపురం డివిజన్: ఎఫ్.సి.ఐ కాలనీ సమీపంలో రూ. 11.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సి.సి రోడ్డు, బి.టి రోడ్డు పనులకు మధ్యాహ్నం 3:00 గంటలకు మంత్రి శ్రీకారం చుట్టనున్నారు.

**ఘన స్వాగతానికి ఏర్పాట్లు:**

ఉప్పల్ వైపు నుంచి రానున్న మంత్రికి నాగోల్ చౌరస్తా వద్ద మధ్యాహ్నం 2 గంటలకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలకనున్నాయి. అక్కడి నుంచి కొత్తపేట మీదుగా భారీ ర్యాలీతో మొదటి శంకుస్థాపన వేదికైన లింగోజిగూడకు మంత్రి చేరుకోనున్నారు.

**విజయవంతం చేయాలని పిలుపు:**

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నేతలు, కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని స్థానిక నాయకత్వం కోరింది. నియోజకవర్గ ముఖచిత్రాన్ని మార్చేలా ఈ నిధులు ఉపయోగ పడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# హస్తినాపురం అభివృద్ధికి రూ. 9.80 కోట్లు..

* **పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్**
* **మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం**




హస్తినాపురం, ఫిబ్రవరి 9 (భారత శక్తి): హస్తినాపురం డివిజన్ ముఖచిత్రాన్ని మార్చే విధంగా మునుపెన్నడూ లేని రీతిలో భారీ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, స్థానిక కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. సోమవారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రూ. 9.80 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సి.సి. రోడ్లు, బి.టి. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మరియు పార్కుల అభివృద్ధి పనులకు ఆమె స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు.

**నిధుల కేటాయింపు వివరాలు:**

* డివిజన్ వ్యాప్తంగా మౌలిక వసతుల మెరుగుదలకు కేటాయించిన నిధుల వివరాలను ఆమె ఈ సందర్భంగా వెల్లడించారు:
* రూ. 5.5 కోట్లు: టీకేఆర్ కాలేజీ రోడ్డు నుండి సాగర్ ఎంక్లేవ్ వరకు, షిరిడి సాయి కాలనీ జెడ్పీ రోడ్డు నుంచి సాగర్ రోడ్డు వరకు అభివృద్ధి పనులతో పాటు హస్తినాపురం సౌత్ కాలనీలో ఫుట్‌పాత్ నిర్మాణం.
* రూ. 3 కోట్లు: విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కాలనీలో సి.సి. రోడ్ల నిర్మాణం.
* రూ. 90 లక్షలు: నార్త్ ఎక్స్టెన్షన్ కాలనీలో సి.సి. రోడ్డు మరియు కమ్యూనిటీ హాల్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం.
* రూ. 30 లక్షలు: సాగర్ ఎంక్లేవ్‌లో సి.సి. రోడ్లు మరియు పార్కు అభివృద్ధి పనులు.

**త్వరితగతిన పనులు పూర్తి చేయాలి:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం హయాంలో గత రెండేళ్లుగా నిధుల వరద పారుతోందని, కొత్తగా ఏర్పడిన కాలనీల్లోనూ మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తున్నామని సుజాత నాయక్ పేర్కొన్నారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ, యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని ఆమె కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ కాలనీ అధ్యక్షుడు మంకాల శేఖర్ రెడ్డి, వందనపురి కాలనీ గౌరవ అధ్యక్షుడు చండీశ్వర్, నాయకులు అమర్నాథ్ యాదవ్, నల్లవెల్లి మనోహర్ రెడ్డి, రాములు నాయక్, మైపాల్ రెడ్డి, సత్యం చారి, శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నరసింహ, సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రేశం మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

* **ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించిన మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి.**
* **భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుప**




పటాన్‌చెరు, ఫిబ్రవరి 9 (భారత శక్తి): పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ఇంద్రేశం మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని ఆ పార్టీ ఎన్నికల కోఆర్డినేటర్, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులలో ఆమె విస్తృతంగా పర్యటించి, ఎన్నికల ప్రచారాన్ని పర్యవేక్షించారు. స్థానిక సమస్యలపై ఆరా.. పర్యటనలో భాగంగా అభ్యర్థులు, స్థానిక నాయకులతో సమావేశమైన ఆమె, వార్డుల్లోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులే పార్టీని గెలిపిస్తాయని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**అభివృద్ధికే పట్టం కట్టండి..**

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు 'చేయి' గుర్తుపై ఓటు వేసి, భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె ప్రజలను కోరారు. ఇంద్రేశం మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు ఎన్నికల ఇంచార్జులుగా వ్యవహరిస్తున్న కంటెస్టెడ్ జెడ్పీటీసీ అభ్యర్థి రాధాకృష్ణ శర్మ, మాజీ ఎంపీటీసీలు కుల్పగురి గోపాల్ యాదవ్, మరగారి శ్రీనివాస్ యాదవ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో పర్యటించండి... విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

అమరావతి, ఫిబ్రవరి 9 (భారత శక్తి):వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే పటిష్టమైన చర్యలు చేపట్టాలని, హాస్టళ్లలో విద్యార్థులు అనారోగ్యం పాలైతే సంబంధిత జిల్లా కలెక్టర్లు, మంత్రులనే బాధ్యుల్ని చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గట్టిగా హెచ్చరించారు. ప్రభుత్వ పాలసీలు క్షేత్రస్థాయిలో ఎలా అమలవుతున్నాయో తెలుసుకునేందుకు మంత్రులు, కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పాలసీలు సమర్థవంతంగా అమలైతేనే ఆశించిన ఫలితాలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. సోమవారం అమరావతి సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల రాష్ట్రం 14 శాతం అధిక వడ్డీతో అప్పులు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక క్రమశిక్షణను గాడిలో పెట్టి, రాష్ట్ర క్రెడిట్ రేటింగ్ పెంచడం ద్వారా వడ్డీ భారాన్ని తగ్గించుకునేందుకు రుణాలను రీషెడ్యూల్ చేస్తున్నామని వివరించారు. ప్రతి ఐదేళ్లకు జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం రెట్టింపు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి**

ఆరోగ్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం సూచించారు. జూలై నాటికి 66 లక్షల హైరిస్క్ కేసులకు హెల్త్ స్క్రీనింగ్ పూర్తి చేయాలని, 5 లక్షల మంది హాస్టల్ విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించారు. గర్భిణుల్లో సిజేరియన్లు తగ్గించి, సాధారణ ప్రసవాలు పెరిగేలా అవగాహన కల్పించాలన్నారు. మాతాశిశు సంరక్షణ కోసం 'కేర్ అండ్ గ్రో' కార్యక్రమాన్ని, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం అందించాలని చెప్పారు. రాష్ట్ర జనాభా నిర్వహణ కోసం మార్చి నాటికి 'పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ' తీసుకురానున్నట్లు సీఎం వెల్లడించారు. విద్యారంగంలో ఒత్తిడి లేని విద్యావిధానం అమలు చేయాలని, పదో తరగతి ఫలితాల్లో మెరుగుదలకు 100 రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆత్మహత్యలు జరగకూడదని, నూతన ఆవిష్కరణలకు స్వేచ్ఛాయుత వాతావరణం ఉండాలని అభిప్రాయపడ్డారు.

*** నీటి సంరక్షణ, అభివృద్ధిపై కీలక సూచనలు**

రాష్ట్రంలోని 38 వేలకు పైగా ఉన్న చిన్న నీటిపారుదల చెరువులను పరిరక్షించాలని, భూగర్భ జలాలను 'నీటి బ్యాంకు' తరహాలో వాడాలని సూచించారు. పారిశ్రామిక కాలుష్యంతో జలాలు కలుషితం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అల్లూరి జిల్లా లంబసింగిలో కుంకుమ పువ్వు సాగు, ఏలూరు సమీపంలో కోకో సిటీ ఏర్పాటు వంటి వినూత్న ప్రాజెక్టులకు అవకాశాలున్నాయని, వీటిని ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మేడారం హుండీల లెక్కింపు... ఐదు రోజుల్లో రూ.11.83 కోట్ల ఆదాయం

ములుగు, ఫిబ్రవరి 9 (భారత శక్తి): మేడారం సమ్మక్క సారక్క జాతరకు సంబంధించిన హుండీల లెక్కింపు కొనసాగుతోంది. నేటితో హుండీల లెక్కింపు ఐదో రోజుకు చేరుకుంది. ఇప్పటి వరకు 788 హుండీలను లెక్కించగా రూ.11.83 కోట్ల ఆదాయం వచ్చింది. ఈరోజు 163 హుండీలను లెక్కించగా రూ.1.12 కోట్ల ఆదాయం సమకూరింది. మిగిలిన హుండీల లెక్కింపునకు సుమారు రెండు రోజులు పట్టవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. మంత్రి కొండా సురేఖ గత గురువారం కొబ్బరికాయ కొట్టి హుండీల లెక్కింపును ప్రారంభించారు. క్రితంసారి మేడారం జాతర ద్వారా రూ.13 కోట్ల ఆదాయం సమకూరింది. హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండపంలో లెక్కిస్తున్నారు. హుండీల లెక్కింపు పూర్తయ్యాక బంగారం, వెండి వస్తువుల విలువను నిర్ధారిస్తారు.

## తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారం, కవిత అంశాలపై రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (భారత శక్తి): తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారం, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికరంగా స్పందించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమల శ్రీవారి లడ్డూ వ్యవహారంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, అది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యవహారమని ముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు. కానీ తెలంగాణలోని అన్ని దేవాలయాలలో విజయ డెయిరీ నెయ్యినే ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. కల్వకుంట్ల కుటుంబం గురించి కూడా ఆయన మాట్లాడారు. కవిత జైలుకు వెళితే కేటీఆర్, హరీశ్ రావు ముఖ్యమంత్రి అవుదామని చూస్తున్నారని వ్యాఖ్యానించారు. మన ఇంటి బిడ్డను బాగా చూసుకుంటే ఏ సమస్య ఉండదని అన్నారు. ఇంటి సమస్యను కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. కలిసి సంపాదించారు, పంపకాల్లో తేడా రావడంతో ఇప్పుడు కొట్టుకుంటున్నారని విమర్శించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే మనకు నష్టం వాటిల్లుతుందని ముఖ్యమంత్రి అన్నారు. తాను ఏ ఎన్నికైనా సీరియస్‌గానే తీసుకుంటానని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు గురించి మాట్లాడుతూ, ఈ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కీలక వ్యక్తి అన్నారు. అతడు 20 నెలలు విదేశాల్లో ఉన్నారని, భారత్‌కు తీసుకు రావడానికి కేంద్రం సహకరించలేదని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రభాకర్ రావును స్వదేశానికి తీసుకు వచ్చామని అన్నారు. ఆ తర్వాతే కేసు విచారణ వేగవంతమైందని ముఖ్యమంత్రి తెలిపారు.

## బీసీసీఐ వార్షిక కాంట్రాక్టులు.. విరాట్, రోహిత్‌లకు షాక్

ఢిల్లీ, ఫిబ్రవరి 9 (భారత శక్తి): బీసీసీఐ 2025 26 సీజన్‌కు సంబంధించిన వార్షిక ఆటగాళ్ల కాంట్రాక్టుల జాబితాను సోమవారం విడుదల చేసింది. ఈ కొత్త జాబితాలో టీమిండియా సీనియర్ స్టార్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ గ్రేడ్ 'బీ'కి పడిపోవడం సంచలనంగా మారింది. ప్రస్తుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, సీనియర్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అగ్రశ్రేణి గ్రేడ్‌లో తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. టెస్టులు, టీ20 ఫార్మాట్ల నుంచి వైదొలగి కేవలం వన్డే క్రికెట్‌కు మాత్రమే పరిమితమైన కారణంగా కోహ్లీ, రోహిత్‌లను గ్రేడ్ 'బీ'కి మార్చినట్టు తెలుస్తోంది. ఈ ఇద్దరు ఆటగాళ్లు ప్రస్తుతం వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా, జింబాబ్వే వేదికగా జరిగే ఐసీసీ వన్డే ప్రపంచకప్‌పై దృష్టి సారించారు. గత ఏడాది గ్రేడ్ 'ఏ'కి ప్రమోషన్ పొందిన ప్రస్తుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. ఈసారి కూడా బుమ్రా, జడేజాలతో కలిసి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మరోవైపు, కోహ్లీ, రోహిత్‌లతో పాటు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వికెట్ కీపర్లు కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్ సహా మొత్తం 11 మంది ఆటగాళ్లు గ్రేడ్ 'బీ'లో ఉన్నారు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న టీ20 ప్రపంచకప్ 2026 జరుగుతున్న సమయంలో బీసీసీఐ ఈ కాంట్రాక్టులను ప్రకటించడం గమనార్హం. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్, ఇప్పటికే తన తొలి మ్యాచ్‌లో యూఎస్ఏపై విజయం సాధించింది.

## అన్నమయ్య జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం...

అన్నమయ్య, ఫిబ్రవరి 9 (భారత శక్తి):ఏపీలోని అన్నమయ్య జిల్లాలో బర్డ్ ఫ్లూ వైరస్ మరోసారి తీవ్ర కలకలం సృష్టిస్తోంది. సదుం మండలంలోని మూడు గ్రామాల్లో వేలాది కోళ్లు అంతుచిక్కని రీతిలో మరణించడం స్థానికంగా ఆందోళనకు దారితీసింది. అధికారిక లెక్కల ప్రకారమే దాదాపు 24 వేలకు పైగా కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ పరిణామంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టింది. వివరాల్లోకి వెళితే.. సదుం మండలంలోని పుట్టవాండ్లపల్లె, కంభంవారిపల్లె, అమ్మగారిపల్లె గ్రామాల్లోని కోళ్ల ఫారాల్లో గత కొన్ని రోజులుగా కోళ్లు భారీ సంఖ్యలో చనిపోతున్నాయి. దీంతో అనుమానం వచ్చిన పశుసంవర్ధక శాఖ అధికారులు రంగంలోకి దిగారు. మరణించిన కోళ్ల నుంచి నమూనాలను సేకరించి మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న హై సెక్యూరిటీ యానిమల్ డిసీజ్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించారు. ఈ పరీక్షల్లో బర్డ్ ఫ్లూ వైరస్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. అమ్మగారిపల్లె, పుట్టవారిపల్లె గ్రామాల్లో కోళ్ల మృతికి బర్డ్ ఫ్లూనే కారణమని స్పష్టమైందని, కంభంవారిపల్లె నివేదిక రావాల్సి ఉందని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై వెల్లడించారు. ఈ పరిణామాలపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బర్డ్ ఫ్లూ కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు జిల్లా కేంద్రంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తమ ప్రాంతంలో కోళ్లు గానీ, ఇతర పక్షులు గానీ అసాధారణ రీతిలో మరణిస్తే వెంటనే 70139 14401 లేదా 93982 62752 నంబర్లకు సమాచారం అందించాలని అధికారులు ప్రజలను కోరారు.

*** కోడి మాంసం తినొచ్చా?.. వైద్యులు ఏం చెబుతున్నారంటే!**

మరోవైపు బర్డ్ ఫ్లూ విషయంలో ప్రజలు అనవసరంగా ఆందోళన చెందవద్దని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ వైరస్ కోళ్ల నుంచి మనుషులకు సోకే అవకాశాలు చాలా అరుదని స్పష్టం చేశారు. అయితే, మాంసాన్ని 100 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద బాగా ఉడికించి తినడం సురక్షితమని తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా, వైరస్ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు కనీసం 10 రోజుల పాటు కోడిమాంసం, గుడ్లకు దూరంగా ఉండటం

## మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ చివరి సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (భారత శక్తి): జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ చివరి సమావేశం నిర్వహించారు. అజెండా అంశాల్లోని 9 ప్రతిపాదనలకు, 11 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, నగర కార్పొరేటర్లు, అధికారుల సమష్టి కృషితో ఐదేళ్లలో నగరాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. తన పదవీ కాలంలో కమిషనర్, అధికారులు ఎంతో సహకారం అందించారని, ఇది మరిచిపోలేనని అన్నారు. మేయర్ పదవీ కాలం పూర్తి కావడంతో విజయలక్ష్మిని ఆమె ఛాంబర్‌లో సన్మానించారు. కాగా, ఇటీవల అహ్మదాబాద్, రాజ్‌కోట్ పురపాలక సంఘాల్లో మేయర్ ఆధ్వర్యంలో పర్యటించిన కార్పొరేటర్ల బృందం నివేదికను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు అందించింది. స్టాండింగ్ కమిటీ ఆమోదించిన పనులు పూర్తి చేస్తామని ఈ సందర్భంగా కమిషనర్ కర్ణన్ అన్నారు. కార్పొరేటర్లు లేవనెత్తిన సమస్యలను చాలా వరకు పరిష్కరించామని అన్నారు.

## పీఎఫ్ డబ్బులు ఇక యూపీఐతోనే.. ఏప్రిల్ నుంచి కొత్త సేవలు!

ఢిల్లీ, ఫిబ్రవరి 9 (భారత శక్తి):ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) తన సేవలను మరింత వేగవంతం, సులభతరం చేసే దిశగా ఒక విప్లవాత్మక అడుగు వేస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 8 కోట్ల మంది పీఎఫ్ ఖాతాదారులకు ప్రయోజనం చేకూర్చేలా సరికొత్త మొబైల్ అప్లికేషన్‌ను తీసుకురానుంది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి అందుబాటులోకి రానున్న ఈ యాప్ ద్వారా, సభ్యులు తమ పీఎఫ్ ఖాతాలోని అర్హతగల మొత్తాన్ని యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా తక్షణమే విత్‌డ్రా చేసుకునే సౌకర్యం కలగనుంది. "ఈపీఎఫ్ఓ 3.0" అప్‌గ్రేడ్‌లో భాగంగా ఈ కొత్త డిజిటల్ వ్యవస్థను ప్రవేశపెడుతున్నారు. ప్రస్తుతం పీఎఫ్ డబ్బుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే, ప్రక్రియ పూర్తి కావడానికి కొన్ని రోజులు పడుతోంది. కాగా, కొత్త ఆటో సెటిల్‌మెంట్ విధానంలో ఎలాంటి మానవ ప్రమేయం లేకుండా మూడు రోజుల్లోనే క్లెయిమ్‌లు పరిష్కారమై, డబ్బు నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. ఇప్పటికే ఈపీఎఫ్ఓ ఆటో సెటిల్‌మెంట్ పరిమితిని రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచింది. ఏటా 5 కోట్లకు పైగా క్లెయిమ్‌లను పరిష్కరించే ఈపీఎఫ్ఓపై భారాన్ని తగ్గించి, బ్యాంకుల తరహాలో వేగవంతమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

**కొత్త యాప్ ఫీచర్లు ఇవే..**

ఈ కొత్త యూపీఐ విత్‌డ్రా వ్యవస్థలో పలు కీలక ఫీచర్లు ఉండనున్నాయి. సభ్యులు తమ యూపీఐ పిన్ ఉపయోగించి, అర్హత ఉన్న నిధులను దాదాపు తక్షణమే తమ బ్యాంక్ ఖాతాకు బదిలీ చేసుకోవచ్చు. వివాహం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం వంటి అత్యవసరాలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రాథమికంగా ఒక్కో లావాదేవీకి గరిష్ఠంగా రూ.25,000 వరకు విత్‌డ్రా చేసుకునే పరిమితిని ప్రతిపాదించారు. యాప్‌లో విత్‌డ్రాకు అందుబాటులో ఉన్న "అర్హతగల బ్యాలెన్స్" స్పష్టంగా కనిపిస్తుంది. అయితే, పదవీ విరమణ భద్రత కోసం మొత్తం బ్యాలెన్స్‌లో కనీసం 25 శాతం లాక్ చేసి ఉంచుతారు. ప్రస్తుతం కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ 100 డమ్మీ ఖాతాలతో ఈ యాప్‌పై ట్రయల్ రన్స్ నిర్వహిస్తోంది. ఏవైనా సాంకేతిక సమస్యలుంటే గుర్తించి, పరిష్కరించిన తర్వాతే దీన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ కొత్త యాప్ యూపీఐ విత్‌డ్రాయల్స్‌కు ప్రధాన వేదికగా మారినప్పటికీ, ఈపీఎఫ్ఓ యూనిఫైడ్ మెంబర్ పోర్టల్, ఉమాంగ్ (UMANG) యాప్ వంటి పాత ప్లాట్‌ఫామ్‌లు ఇతర సేవల కోసం యథావిధిగా పనిచేస్తాయని అధికారులు తెలిపారు.



## తెలంగాణలో ముగిసిన ఎన్నికల ప్రచారం.. ఎల్లుండి పోలింగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎల్లుండి పోలింగ్ జరగనుంది. ఈరోజుతో ప్రచారం ముగియడంతో రాష్ట్రంలో మైకులు మూగబోయాయి. ఈ నెల 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అనివార్యమైతే ఈ నెల 12న రీపోలింగ్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13 ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. గెలిచిన వారు మరుసటి రోజు వార్డు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనుంది.

## 'పరీక్షా పే చర్చ'లో దేశ నిర్మాణంపై విద్యార్థులకు మోదీ పాఠాలు




ఢిల్లీ, ఫిబ్రవరి 9 (భారత శక్తి): 10, 12వ తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే 'వికసిత భారత్' నిర్మాణం గురించి ఆలోచిస్తుండటం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా దేశ భవిష్యత్తు లక్ష్యాలపై యువత దృష్టి సారించడం గొప్ప విషయమని ఆయన అన్నారు. ఇవాళ 'పరీక్షా పే చర్చ 2026' రెండో ఎపిసోడ్‌లో భాగంగా ఆయన దేశవ్యాప్తంగా విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడులోని కోయంబత్తూరుతో పాటు పలు ప్రాంతాల విద్యార్థులతో ప్రధాని సంభాషించారు. 2047 నాటికి దేశాభివృద్ధికి దోహదపడాలనే విద్యార్థుల ఆసక్తిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా అభివృద్ధి చెందిన దేశాల పౌరులలో ఉండే క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. "ఇంట్లో భోజనం చేసేటప్పుడు ప్లేటులో ఒక్క మెతుకు కూడా వృథా చేయకుండా తినడం అలవాటు చేసుకోండి. ఇలా దేశంలోని ప్రతి ఒక్కరూ చేస్తే ఎంత ఆహారం ఆదా అవుతుందో ఊహించండి. ఇలాంటి చిన్న పనులే బలమైన, బాధ్యతాయుతమైన భారత నిర్మాణానికి పునాదులు వేస్తాయి" అని మోదీ విద్యార్థులకు వివరించారు. అలాగే ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రెడ్ లైట్ పడినప్పుడు ఆగడం వంటి చిన్న విషయాలు కూడా వ్యక్తిగత క్రమశిక్షణకు నిదర్శనమని ప్రధాని తెలిపారు. స్ఫూర్తి, ప్రేరణ వంటివి విజయానికి కేవలం అదనపు హంగులు మాత్రమేనని, కానీ క్రమశిక్షణే దానికి అసలైన పునాది అని ఆయన స్పష్టం చేశారు. తొమ్మిదో విడతగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి 4.5 కోట్లకు పైగా రిజిస్ట్రేషన్లు రావడం విశేషం. పరీక్షల ఒత్తిడిని తగ్గించడంతో పాటు దేశ ప్రగతిలో తమ పాత్ర గురించి విద్యార్థులను ఆలోచింపజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

* రంగంలోకి దిగిన హైడ్రా.. రూ. 60 కోట్ల భూమి స్వాధీనం
* 3 వేల గజాల స్థలానికి రక్షణగా ఫెన్సింగ్, బోర్డులు

# ఆక్రమణల చెర నుంచి 'అరుణోదయ' పార్కు విముక్తి!

నార్సింగి, , ఫిబ్రవరి 9 (భారత శక్తి): విలువైన ప్రభుత్వ భూములే లక్ష్యంగా సాగుతున్న కబ్జారాయుళ్ల ఆగడాలకు 'హైడ్రా' బ్రేక్ వేసింది. గండిపేట మండలం నార్సింగిలోని అరుణోదయ హౌసింగ్ సొసైటీలో కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని సోమవారం అధికారులు విముక్తి కల్పించారు. సుమారు రూ. 60 కోట్ల విలువైన 3 వేల గజాల స్థలాన్ని స్వాధీనం చేసుకుని, చుట్టూ రక్షణ కవచంలా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

**సాగిందిలా..**

నార్సింగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సమీపంలోని అరుణోదయ కాలనీ హుడా (HUDA) అనుమతి పొందిన లేఅవుట్‌లో 6,078 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. అయితే, గత కొంతకాలంగా ఈ విలువైన భూమిపై స్థానిక భూబకాసురుల కన్ను పడింది. ఇప్పటికే సుమారు 3 వేల గజాల వరకు అక్రమ నిర్మాణాలు వెలిశాయి. మిగిలిన 3 వేల గజాల్లోనూ 1,600 గజాలను ఓ వ్యక్తి ఆక్రమించి, ప్రీకాస్ట్ ప్రహరీ నిర్మించి షెడ్లు వేశారు. గతంలో నార్సింగి మున్సిపల్ అధికారులు ఈ అక్రమ నిర్మాణాలను తొలగించినప్పటికీ, సదరు వ్యక్తి తీరు మారలేదు. ప్రస్తుతం నార్సింగి మున్సిపాలిటీ జీహెచ్ఎంసీలో విలీనమయ్యే ప్రక్రియను ఆసరాగా చేసుకుని, మళ్లీ ప్రహరీ గోడ కట్టి ఆక్రమణకు ప్రయత్నించారు.




**ప్రజావాణి ఫిర్యాదుతో కదలిక:**

ఈ కబ్జాపై స్థానికులు హైడ్రా 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేయడంతో యంత్రాంగం అప్రమత్తమైంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి సర్వే నిర్వహించారు. అది పార్కు స్థలమేనని నిర్ధారించుకున్న అనంతరం, సోమవారం ఉదయం ఆక్రమణలను తొలగించారు. మిగిలిన 3 వేల గజాల స్థలం మళ్లీ ఆక్రమణకు గురికాకుండా చుట్టూ ఫెన్సింగ్ వేయడంతో పాటు, "ఇది పార్కుకు కేటాయించిన స్థలం" అని తెలిపే బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో హైడ్రా తీసుకున్న ఈ సత్వర చర్యపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## 22వ వార్డ్ లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్న ఎరువ అరుణ మెకానిక్ శ్రీను యాదవ్

వనపర్తి జిల్లా , ఫిబ్రవరి 9 (భారత శక్తి): వనపర్తి మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా 22వ వార్డ్ బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి మెకానిక్ శ్రీను భార్య ఏరువ అరుణ యాదవ్ సోమవారం రోజు ఇంటింటి ప్రచారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్న నాయకులు కార్యకర్తలు ఈ సందర్భంగా ఏరువ అరుణ యాదవ్ మాట్లాడుతూ ఈ ప్రచారానికి వార్డ్ ప్రజల నుండి సానుకూల స్పందన లభిస్తుంది మెకానిక్ శ్రీను యాదవ్ ప్రతినిత్యం ప్రజల మనిషిగా ప్రజలకు సేవ చేసే అంకితభావంతో ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ ముందడుగు వేస్తారని అధికారంలో ఉన్నా లేకున్నా వార్డ్ సమస్యల పట్ల స్పందిస్తూ పరిష్కారం కొరకు కృషి చేశారని ఈసారి మెకానిక్ శ్రీను భార్య ఎరువ అరుణ యాదవను తప్పకుండా గెలిపించుకుంటామని ప్రజలు హామీ ఇస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు.

# నగరాభివృద్ధికి 'స్టాండింగ్' గ్రీన్ సిగ్నల్

* 20 ప్రతిపాదనలకు కమిటీ ఆమోదం
* క్రీడా మౌలిక వసతులు, రహదారుల విస్తరణపై దృష్టి
* ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పేరు మార్పు ప్రతిపాదన ప్రభుత్వానికి..

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (భారత శక్తి): నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, క్రీడా ప్రాంగణాల అభివృద్ధి మరియు ప్రజా ఉపయోగకర పనులే ధ్యేయంగా జీహెచ్ఎంసీ అడుగులు వేస్తోంది. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మేయర్ అధ్యక్షతన నిర్వహించిన 12వ సాధారణ స్టాండింగ్ కమిటీ సమావేశం పలు కీలక నిర్ణయాలకు వేదికైంది. ఎజెండాలోని 9 అంశాలతో పాటు మరో 11 అదనపు అంశాలకు కమిటీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

* **క్రీడలకు పెద్దపీట.. బాక్సింగ్ కోర్టు నిర్మాణం**

నగర యువతను క్రీడల వైపు ప్రోత్సహించేలా కమిటీ పలు నిర్ణయాలు తీసుకుంది. చందానగర్ పీ అండ్ టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కొత్తగా బాక్సింగ్ కోర్టు నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. కేపీహెచ్‌బీ కాలనీలోని క్రికెట్ ప్రాక్టీస్ పిచ్‌లు, ఇండోర్ షటిల్ కోర్టుల నిర్వహణ బాధ్యతలను 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్' (EOI) ద్వారా ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని నిర్ణయించారు. అలాగే బాలానగర్, నెక్సస్ మాల్ ఫ్లైఓవర్ల కింద ఉన్న ఖాళీ స్థలాలను క్రీడా ప్రాంగణాలుగా తీర్చిదిద్దే ప్రతిపాదనలకు కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

* **రహదారుల విస్తరణ.. చెరువుల సుందరీకరణ:**





నగరంలో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు రహదారుల బలోపేతంపై కమిటీ దృష్టి సారించింది. ఆనంద్‌నగర్‌మంసూరాబాద్: 30 మీటర్ల మేర రహదారి విస్తరణకు గానూ 195 ఆస్తుల స్వాధీనం, మాస్టర్ ప్లాన్ మార్పులకు ఆమోదం తెలిపారు. సరోజినీనగర్‌కోణార్క్ రోడ్డు: ఇక్కడ 256 ఆస్తుల స్వాధీనం ద్వారా 30 మీటర్ల రోడ్డు విస్తరణ పనుల పురోగతిని ప్రభుత్వానికి నివేదించనున్నారు. కుషాయిగూడ: మారుతి ఎన్‌క్లేవ్ నుంచి పోచమ్మ ఆలయం వరకు దెబ్బతిన్న బీటీ రోడ్ల రీకార్పెటింగ్‌కు అనుమతి లభించింది. నడిమి చెరువు: సాఫిల్గూడ నడిమి చెరువులో గుర్రపుడెక్క తొలగింపు, ఫెన్సింగ్ మరియు డ్రైనేజీ మళ్లింపు పనుల ద్వారా చెరువును సుందరీకరించనున్నారు.

* **మౌలిక సదుపాయాలు - ప్రజా సౌకర్యాలు:**

కాప్రా, ఉప్పల్ ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్లు, మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్లు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు కమిటీ ఆమోదముద్ర వేసింది. వైకుంఠధామాల నిర్వహణను మెరుగుపరచడంలో భాగంగా మూసాపేట సర్కిల్ పరిధిలోని శ్మశానవాటిక నిర్వహణ బాధ్యతలను బిడ్డింగ్ ద్వారా అప్పగించాలని నిర్ణయించారు.

**కారిడార్ పేరు మార్పు:**

ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మించిన ఎలివేటెడ్ కారిడార్‌కు *'శ్రీ బండారి రాజీ రెడ్డి కారిడార్'*గా పేరు పెట్టాలన్న ప్రతిపాదనపై కమిటీ చర్చించింది. దీనిపై తుది నిర్ణయం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని తీర్మానించారు.

ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్. వి. కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సయ్యద్ మిన్హాజుద్దీన్, జగదీశ్వర్ గౌడ్ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## కాలనీ సంఘాల.. 'కబ్జా' కోరల్లో ప్రజా స్థలాలు!

* అప్పనంగా అమ్మేస్తున్న వైనం.. ప్రశ్నిస్తే దాడులు
* హైడ్రా 'ప్రజావాణి'కి పోటెత్తిన ఫిర్యాదులు: ఒక్కరోజే 72 వినతులు
* చెరువులు, పాఠశాల మైదానాలూ వదలని ఆక్రమణదారులు

హైదరాబాద్, హైదరాబాద్, ఫిబ్రవరి 9 (భారత శక్తి): నగరంలోని కాలనీల్లో పచ్చదనాన్ని పంచాల్సిన పార్కులు, ప్రజా అవసరాల కోసం కేటాయించిన ఖాళీ స్థలాలు కబ్జా కోరల్లో చిక్కుకుంటున్నాయి. రక్షించాల్సిన కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులే భక్షకులుగా మారి యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. అసోసియేషన్ల ముసుగులో పార్కులు, రహదారులు, చివరకు పాఠశాల క్రీడా మైదానాలను కూడా గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్న వైనం సోమవారం నిర్వహించిన *'హైడ్రా ప్రజావాణి'*లో వెలుగుచూసింది. ఈ క్రమంలో మొత్తం 72 ఫిర్యాదులు రాగా, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వాటిని స్వీకరించి విచారణకు ఆదేశించారు.

* **వేలం వెర్రిగా ఆక్రమణలు.. అధికారుల మౌనం**

స్థానిక అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని, ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదని బాధితులు కమిషనర్ వద్ద వాపోయారు. ఆక్రమణలను ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం, అక్రమ కేసులు పెట్టడం వంటి చర్యలతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

* **ప్రజావాణిలో ప్రధాన ఫిర్యాదులు ఇవే:**

స్కూల్ గ్రౌండ్‌పై కన్ను: కూకట్‌పల్లి వెంకటేశ్వర నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారు. దీనిపై కలెక్టర్, పోలీసులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని, విద్యార్థుల ఆటస్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరారు.

ఎల్లమ్మ చెరువు విలవిల: మణికొండ ల్యాంకో హిల్స్ సమీపంలోని ఎల్లమ్మ చెరువు చుట్టూ క్రికెట్ గ్రౌండ్లు, పార్కింగ్ స్థలాలు వెలిశాయి. రియల్టర్లు సైతం చెరువును కబ్జా చేసి భవనాలు నిర్మిస్తున్నారని, వెంటనే హద్దులు నిర్ణయించాలని ఫిర్యాదు అందింది.

>> పార్కు స్థలంలో ప్లాట్లు: మల్కాజిగిరి రాధాకృష్ణ హౌసింగ్ కాలనీలో పార్కు కోసం కేటాయించిన 600 గజాల్లో ఇప్పటికే 136 గజాలు కబ్జాకు గురైందని, వెంటనే ఫెన్సింగ్ వేసి మిగిలిన స్థలాన్ని కాపాడాలని కాలనీవాసులు విన్నవించారు.

>> ట్యాంకుల స్థలం విక్రయం: గచ్చిబౌలి టీఎన్‌జీవో కాలనీలో సెప్టిక్ ట్యాంక్, వాటర్ ట్యాంకర్ కోసం కేటాయించిన స్థలంలో కొత్తగా ప్లాట్లు వేసి అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితులు తెలిపారు. సంఘాల స్థలాలూ హాంఫట్: ఖానామెట్‌లో ఆల్ ఇండియా వెలమ సంఘానికి కేటాయించిన 5 ఎకరాల స్థలంపై కోర్టు స్టే ఉండటాన్ని ఆసరాగా తీసుకుని, చుట్టుపక్కల వారు మట్టి పోసి ఆక్రమిస్తున్నారని, అడ్డుకున్న వాచ్‌మెన్‌పై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు: కాప్రా సర్వే నంబర్ 215లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా లేఅవుట్లు వేసి గదులు, ఫంక్షన్ హాళ్లు నిర్మిస్తున్నారని, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు.

* **అధికారులకు కమిషనర్ ఆదేశం**

వచ్చిన ఫిర్యాదులన్నింటినీ పరిశీలించిన కమిషనర్ రంగనాథ్, సంబంధిత విభాగాల అధికారులకు వీటిని బదిలీ చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, ఆక్రమణలు నిరూపితమైతే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## సమిష్టి కృషితోనే నగర ప్రగతి: మేయర్ విజయలక్ష్మి

* స్టాండింగ్ కమిటీ ఆమోదించిన పనులన్నీ పూర్తి చేస్తాం: కమిషనర్ ఆర్.వి.కర్ణన్.




హైదరాబాద్, హైదరాబాద్, ఫిబ్రవరి 9 (భారత శక్తి): నగర ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం మరియు సమిష్టి కృషితోనే గడిచిన ఐదేళ్లలో గ్రేటర్ హైదరాబాద్‌లో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయగలిగామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆమె అధ్యక్షతన తుది స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ అయిన జీహెచ్ఎంసీకి మేయర్‌గా సేవలు అందించడం తనకు దక్కిన గౌరవమని, తన పదవీకాలంలో కమిషనర్, అధికారులు అందించిన సహకారం మరువలేనిదని భావోద్వేగంగా వెల్లడించారు.

* **సమస్యల పరిష్కారమే లక్ష్యం:**

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ.. క్లిష్ట సమయాల్లోనూ ప్రజాప్రతినిధుల సహకారంతో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించామన్నారు. వార్డుల పునర్వ్యవస్థీకరణపై ప్రత్యేక సెషన్ నిర్వహించి సభ్యుల అభ్యంతరాలను స్వీకరించామని, కార్పొరేటర్లు లేవనెత్తిన ప్రజా సమస్యలను గరిష్ఠంగా పరిష్కరించామని తెలిపారు. స్టాండింగ్ కమిటీ ఆమోదం పొందిన ప్రతి అభివృద్ధి పనినీ క్షేత్రస్థాయిలో అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

**స్టడీ టూర్ నివేదిక సమర్పణ:**

ఇటీవల మేయర్ నేతృత్వంలోని కార్పొరేటర్ల బృందం అహ్మదాబాద్, రాజ్‌కోట్ నగరాల్లో పర్యటించిన విషయం తెలిసిందే. అక్కడ గమనించిన ఉత్తమ పురపాలక విధానాలు, మౌలిక వసతుల కల్పనపై రూపొందించిన సమగ్ర నివేదికను సమావేశం అనంతరం మేయర్, కమిషనర్‌కు అందజేశారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఈ విధానాలను అధ్యయనం చేసి అమలు చేయాలని సూచించారు.

* **వీడ్కోలు సత్కారాలు..**

మేయర్ పదవీకాలం రేపటితో (మంగళవారంతో) ముగియనున్న నేపథ్యంలో, కమిషనర్ ఆర్. వి.కర్ణన్ తన ఛాంబర్‌లో మేయర్‌ను శాలువాతో సత్కరించి, మెమెంటోను బహూకరించారు. అదేవిధంగా, స్టాండింగ్ కమిటీ సభ్యులు మేయర్, కమిషనర్‌లను ప్రత్యేకంగా ప్రశంసించారు. తమ వార్డుల్లోని సమస్యలను ఓపికగా విని పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ వారిని సన్మానించారు. అనంతరం అందరూ

## రూ.4.76 కోట్ల గంజాయి కాల్చివేత

: **డిప్యూటి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి**

భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 09 (భారతశక్తి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలోని ఆరు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో నమోదైన 47 కేసుల్లో సుమారుగా రూ. 4.76 కోట్ల విలువ చేసే 953 కేజీల గంజాయిని కాల్చివేతకు ఖమ్మం డిప్యూటి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి అదేశాలు జారీ చేశారు. ఈ మేరకు స్టేషన్లలో కేసుల వారిగా గంజాయిని ఒక దగ్గరకు చేర్చి మొత్తంగా 953 కేజీల గంజాయిని తల్లాడ మండలం గోపాల్‌పేట్‌లో గల ప్రభుత్వ అమోదిత ఏడబ్ల్యూఎం కన్సంటింగ్ లిమిటేడ్ పరిశ్రమలో సోమవారం కాల్చివేశారు. ఖమ్మం జిల్లాలోని ఖమ్మం 1 ఎక్సైజ్ స్టేషన్‌లో 9 కేసుల్లో 42 కేజీలు, ఖమ్మం 2 స్టేషన్‌లో 5 కేసుల్లో 57 కేజీల, మధిర స్టేషన్‌లోని 7 కేసుల్లో 193 కేజీల, కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ స్టేషన్‌లో 2 కేసుల్లో 114 కేజీలు, మణుగూరు స్టేషన్‌లో ఒక కేసులో 21 కేజీలు, భద్రాచలం స్టేషన్‌లో 23 కేసుల్లో 625 కేజీల గంజాయిని కాల్చివేసినట్లు డిప్యూటి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి తెలిపారు.



Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.